TGTEL/25/A1805 వెల: 4/-

దిశా నిర్దేశం

మన దిశా నిర్దేశం

సంపుటి: 1 సంచిక: 356 నిజామాబాద్ | బుధవారం | 16-09-2026 పేజీలు: 08

# బంగారం సృష్టించిన నగరం!

## భూమి కింద బయటపడిన అపారమైన బంగారం..

- భూమి పైన జోహన్నెస్ బర్గ్‌ను ఎలా పుట్టించింది?
- 1886... జోహన్నెస్ బర్గ్ చరిత్రను మార్చిన ఏడాది!
- కనిపించేది మాత్రమే బంగారం కాదు..
- నేల లోపలే అసలైన సవాళ్లు!
- రాజకీయాలనూ శాసించిన బంగారం కథ!
- ప్రపంచ బంగారంలో ఎంత వాటా..?



6 లో

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

- ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్‌తో సీఎం రేవంత్

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా మరింత సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని కోరారు. భారత పర్యటనలో ఉన్న ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగిన ఈ సమావే శంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందని పేర్కొంటూ, హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. - దిశా నిర్దేశం, హైదరాబాద్





# 3,383 కోట్లున్న బిచ్చగాడు..

## బీజేపీ ఎమ్మెల్యే ఒకరోజు బిచ్చగాడి అవతారం

(యాటకర్ల మల్లేష్ ముదిరాజ్)


ముంబైలోని ఘట్‌కోపర్ ఈస్ట్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే పరాగ్ షా వేల కోట్ల ఆస్తులు, రక్షణ భద్రత, కార్లు అన్నీ పక్కన పెట్టి ఒక్క రోజు బిచ్చగాడి వేషంలో రోడ్డుపై కూర్చున్నారు. మురికి బట్టలు వేసుకుని మేకప్ చేయించుకుని ఘట్‌కోపర్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో భిక్షం అడిగారు. వీడియో వైరల్ అయ్యాకే కారణం బయటపడింది. జైన ఆధ్యాత్మిక గురువు నమ్రముని మహారాజ్ సూచన మేరకు జైన చాతుర్మాస - పర్యుషణ కాలంలో ఈ అనుభవం పొందారు.

2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తి రూ.3,383 కోట్లకు పైగా. అప్పట్లో రాష్ట్రంలోనే అత్యంత సంపన్న అభ్యర్థిగా నిలిచారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి, మ్యాన్ ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్‌కు అనుబంధం ఉన్న ఆయన గతంలో బీఎంసీ కార్పొరేటర్‌గా కూడా పనిచేశారు. అంత సౌకర్యం ఉన్నప్పటికీ గురువు చెప్పినట్లు సెక్యూరిటీ, వాహనాలు, ఖరీదైన వస్తువులు వదిలేసి సామాన్యుడిలా వీధుల్లో తిరిగారు. ఎవరూ గుర్తు పట్టలేదు.

అనుభవం గురించి ఆయన చెప్పిన మాటలు ఇలా ఉన్నాయి. “గౌరవం, గుర్తింపు అన్నీ స్థానాన్ని బట్టి మారతాయి. అదే వ్యక్తులు నన్ను ఎమ్మెల్యేగా చూసినప్పుడు ఒకలా ఉంటారు, బిచ్చగాడిగా చూసినప్పుడు మరోలా ఉంటారు. అదే జీవితం యదార్థం.” ఒకరు రూ.20 ఇచ్చి “వెళ్లి భోజనం చేయి బాబా” అన్నారు. సమోసా విక్రేత ఉచితంగా ఇచ్చాడు. ముంబై ప్రజలు ఒకరికొకరు సహాయం చేసుకునే స్వభావం ఉందని ఆయన అన్నారు. తర్వాత వేషం తీసేసి అదే ప్రాంతంలోని స్థానికులతో మాట్లాడి కృతజ్ఞత తెలిపారు.

ఇది రాజకీయ ప్రచారం కాదని, గురువు ఆజ్ఞతో చేసిన ఆధ్యాత్మిక ప్రయోగమని ఆయన స్పష్టం చేశారు. డబ్బు, అధికారం వల్ల కలిగే అహంకారం తగ్గాలని, సామాన్యుల కష్టాలు అర్థం చేసుకోవాలని ఈ అనుభవం ఉపయోగపడిందని చెప్పారు. సోషల్ మీడియాలో వీడియో వ్యాప్తి చెందడంతో కొందరు ప్రశంసించగా, కొందరు ఇది షో అని విమర్శించారు. అయినా ఘటన మాత్రం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## మాట తప్పడమే రేవంత్ ట్రేడ్ మార్క్




- సమస్యలు తీర్చాలని అడిగితే ఉద్యోగులు, ఉపాధ్యాయులను బెదిరిస్తున్నడు
- ఉద్యోగులంటే మీ బానిసలు కాదని గుర్తు పెట్టుకోండి
- ఈ నెల 18 లోగా వారికిచ్చిన హామీలు నెరవేర్చాలి
- లేదంటే హైదరాబాద్ దిగ్బంధానికి ఉద్యోగ సంఘాలు సిద్ధం కావాలి
- వారి పోరాటానికి అన్ని విధాలుగా టీఆర్‌ఎస్ మద్దతుగా నిలుస్తుంది
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

4 లో

## హౌసింగ్ ఫర్ ఆల్ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక

- 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలి
- కేంద్ర సహకారంతో ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌ల నిర్మాణం
- గృహ నిర్మాణ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

# కట్టు బట్టలతో వలస వచ్చి.. ఆపదలో ఉన్నోళ్లను ఆదుకునే స్థాయికి...



సక్సెస్ స్టోరీ

## మానవత్వమే సందిరి గోవర్ధన్ రెడ్డి చిరునామా

డబ్బు అన్నిటినీ నిర్ణయిస్తున్న కాలంలో, ఆపదలో ఉన్నవారిని అన్నలా చూసే మనిషి సందిరి గోవర్ధన్ రెడ్డి. మానసిక వికలాంగులు కనిపిస్తే ఒక పూట భోజనం పెడతారు. ఆసుపత్రి బిల్లులు కట్టలేని వారు సహాయం అడిగితే ఖాళీ చేతులతో పంపరు. ఇవన్నీ చేస్తు న్నారని ఆయన పుట్టుకతో ధనవంతులు కాదు. కష్టమే ఫలిస్తుందని నమ్మి, బ్రతుకు తెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి రాతింబవళ్లు పనిచేసిన వ్యక్తి.

6 లో

### మన దిశా నిర్దేశం

నమ్మకం
ఒకరి మీద పెట్టుకుంటే
అది మన బలహీనతవుతుంది
నమ్మకం మనమీద మనం
పెట్టుకుంటే అది మనకు
బలమవుతుంది
నడి సముద్రంలో చిక్కుకున్నవారికి
ఎవరోవచ్చి ఒడ్డుకు చేరుస్తారని
అనుకోవడం మన బలహీనత
చేతికందిన చెక్కముక్కతో
ఒడ్డుకు చేరాలనుకోవడం
మన బలం.

సేకరణ: ప్రభాకర్ ఆడెపు

## నిశ్శబ్దం బద్దలైంది...



### నవశక్తికి శోభా డే నీరాజనం!

యువత తిరుగుబాటుపై మౌనం వీడిన రచయిత్రి

జెన్ జీ పోరాటానికి జేజేలు!

- వివరాలు 8 లో..

# జస్ట్, సెక్యూరిటీ కాదు

## రాష్ట్రపతి పక్కన నడక అంత ఈజీ కాదు!

రాష్ట్రపతి పక్కన ఎప్పుడూ తప్పకుండా కనిపించే ఒక అధికారి అసలు ఉద్యోగం కేవలం రక్షణేనా? కాదు, వివరంగా చెప్పుకుందాం ఓసారి...

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్కడికి వెళ్లినా ఆమె వెంటే కనిపించే ఒక యువ ఆర్మీ అధికారి సోషల్ మీడియాలో చాలామందికి సుపరిచితమే. యూనిఫామ్‌లో హుందాగా కనిపించే మేజర్ రిషభ్ సింగ్ సంబ్యాల్‌కు కొంతకాలానికే ‘నేషనల్ క్రష్’ అనే ట్యాగ్ కూడా వచ్చేసింది. కానీ కెమెరాలో కనిపించే ఆ కొన్ని సెకన్ల వెనుక ఉన్న జీవితం మాత్రం అంత అందంగా ఏమీ లేదు.

12 ఏళ్ల సైనిక జీవితానికి, అందులో మూడేళ్లపాటు రాష్ట్రపతికి ఎయిడ్-డి-కాంప్‌గా పనిచేసిన తర్వాత 30 ఏళ్లకే రిషభ్ ఆర్మీ నుంచి ముందస్తు రిటైర్మెంట్ తీసుకున్నాడు. “ఇది నా జీవితంలోనే అత్యంత కఠినమైన నిర్ణయం” అని చెప్పిన ఆయన.. కుటుంబ బాధ్యతలే కారణమని వెల్లడించాడు. ఈ నిర్ణయం ఒక్కరోజులో తీసుకున్నది కాదు. దాదాపు నాలుగు నెలల పాటు ఆలోచించిన తర్వాతే యూనిఫామ్‌కు వీడ్కోలు పలికాడు.

- వివరాలు 8 లో..



## తిమ్మాపూర్‌లో విపస్సి ధ్యాన కేంద్రం ప్రారంభోత్సవం



**దిశా నిర్దేశం, ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌లోని మోక్షానంద బుద్ధ విహార్ (ఎంబివి)లో ఆదివారం ఐతిహాసిక "విపస్సి ధ్యాన కేంద్రం" ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో సంఘపాల బంతే చేతుల మీదుగా ధమ్మ ధ్వజారోహణ, బుద్ధపాల బంతే చేతుల మీదుగా బుద్ధ విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. హైదరాబాద్ నుంచి వచ్చిన చెన్నూరి ఆంజనేయ రెడ్డి, కె.కె రాజు, గౌతం ప్రసాద్ అతిథి ఉపన్యాసాలు చేశారు. విగ్రహదాత డాక్టర్ పాకాల మమత. ప్రారంభంలో విగ్రహ ప్రతిష్టాపన ప్రార్థన, త్రిషరణం, పంచశీలాలు పఠించారు

## అంబేద్కర్‌పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

### పోలీసులకు ఫిర్యాదు చేసిన బహుజన్ ముక్తి పార్టీ




**దిశా నిర్దేశం, హైదరాబాద్:**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కల్పిత నాయకుడు, దేశవ్యతిరేకి అని సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న హమారా ప్రసాద్‌పై కేసు నమోదు చేయాలని బహుజన్ ముక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుబ్బంపల్లీ శామల్ రాజ్ రాజేంద్రనగర్ సీఐకి ఫిర్యాదు చేశారు. కుల వ్యవస్థలో హక్కులు లేని దళితుల కోసం అంబేద్కర్ పోరాడి రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించారని, మహిళా హక్కుల కోసం మంత్రి పదవిని వదిలిన త్యాగమూర్తి అని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాంటి మహనీయుడిని అవమానించడం కోట్ల మంది అంబేద్కరైట్ ప్రజలను కించపరచడమేనని, చట్టపరమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## "ప్రేమ వివాహాలు" సమాజ అభివృద్ధికి అత్యవసరం



**దిశా నిర్దేశం, నిజామాబాద్:** ప్రేమ వివాహాలు సమాజ అభివృద్ధికి అత్యవసరమని ముంబై నుంచి విచ్చేసిన అంబేద్కరైట్ మేధావి మూలనివాసి మాలజీ అన్నారు. జిల్లా మోర్తాడ్ మండలం పాలెం గ్రామంలో ఆరే అరుణ్, ప్రీతి లవ్ మ్యారేజ్ జంట రిసెప్షన్‌లో ఆయన మాట్లాడారు. ఆగస్టు 24న జరిగిన వివాహానికి ఆదివారం సొంతూళ్లో రిసెప్షన్ జరిగింది. ఇరుపక్షాల కుటుంబాలు సంతోషంగా కలిశాయి.

ప్రేమలో వ్యక్తిత్వమే ముఖ్యమని, కులం-ఆస్తి కంటే మనసుకు ప్రాధాన్యం ఉండాలని, జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ అవసరమని ఆయన అన్నారు. మూఢాచారాలకు లవ్ మ్యారేజీలు విద్రోహమని చెప్పారు. గ్రామ అంబేద్కరైట్ కార్యకర్తలు, బంధుమిత్రులు నూతన దంపతులకు భారత రాజ్యాంగం పుస్తకం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన..



**దిశా నిర్దేశం, హైదరాబాద్:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరుణంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వర్షాలు, మంగళవారం పరిస్థితులపై వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. ఈ మేరకు ఏపీ, తెలంగాణలోని పలు ప్రాంతాలకు వర్ష సూచనలు జారీ చేసింది. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులతో వానలు పడే ఛాన్స్ ఉందని.. వచ్చే రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది.

### ఏపీలో రాబోయే రెండు రోజులకు వర్ష హెచ్చరిక:

ఏపీలో కూడా వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ పేర్కొంది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి, ఉపరితల వాయు ప్రసరణ ప్రభావం కారణంగా, రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇస్రాణవీూ వెల్లడించింది. మంగళ, బుధవారాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు (ఉరుములు, మెరుపులతో) కురుస్తాయని పేర్కొంది. కోస్తా జిల్లాలలతోపాటు.. నంద్యాల, అనంతపురం, చిత్తూరు, తిరుపతి తోపాటు.. మిగిలిన జిల్లాల్లో కూడా వర్షాలు కురుస్తాయని తెలిపింది.

మెరుపులు, ఈదురు గాలుల సమయంలో చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల దగ్గర నిలబడవద్దని, పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండి, సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని వాతావరణ శాఖ అధికారులు సూచనలు చేశారు.

# నిజామాబాద్ ప్రభుత్వ వైద్యుడికి జాతీయ వేదికపై గుర్తింపు

- 'ప్రైవేట్ ప్రాక్టీస్‌లో పాలీఫార్మసీ-అవసరమా, అలవాటా?' అంశం
- జాతీయ వేదికపై సత్తా చాటిన నిజామాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ విశాల్ అకుల

(యాటకర్ల మల్లేష్ ముదిరాజ్)






విశాఖపట్టణంలో ఆదివారం జరిగిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సైకియాట్రీ (ఐఏపీపీ) సౌత్ జోనల్ సీఎంఈ, ఆంధ్రప్రదేశ్ తొలి సదస్సులో నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల సైకియాట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ విశాల్ అకుల సత్తా చాటారు. 'ప్రైవేట్ ప్రాక్టీస్‌లో పాలీఫార్మసీ-అవసరమా, అలవాటా?' అనే అంశంపై ప్యానెల్ చర్చకు మోడరేటర్‌గా వ్యవహరించి, మందుల మోతాదు, వాడకంపై జరిగిన చర్చను ఆకట్టుకునేలా నడిపారు. వైద్యుని సూచన లేకుండా మందులు ఆపవద్దని ఆయన స్పష్టం చేశారు.

కౌసల్య కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మృగేష్ వైష్ణవ్ ముఖ్యోపన్యాసం చేశారు. దేశంలో మానసిక ఆరోగ్య సేవల్లో మూడు నాలుగు వంతులు ప్రైవేట్ రంగం అందిస్తోందని, ప్రైవేట్ వైద్యులు ఆధునిక పద్ధతులు అవలంబించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాల్ అకులను సత్కరించి గుర్తింపు పతకం అందించారు.




డాక్టర్ విశాల్ అకుల ఎంబీబీఎస్, ఎండీ (సైకియాట్రీ). న్యూరోసైకియాట్రిస్ట్, మాదకద్రవ్య నివారణ నిపుణుడిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ శాఖ ప్రెసిడెంట్-ఎలెక్ట్‌గా ఉన్నారు. ఐపీఎస్ జాతీయ అడిక్షన్ మెడిసిన్ విభాగం చైర్మన్, ఐఎంఏ తెలంగాణ మానసిక ఆరోగ్య కమిటీ కన్వీనర్‌గా కూడా పనిచేస్తున్నారు. గ్రామీణ ఆరోగ్యం, డీ-అడిక్షన్, కమ్యూనిటీ మానసిక ఆరోగ్య సేవలకు గాను ఐఎంఏ జాతీయ పురస్కారం కూడా ఆయనకు లభించింది.

పాలీఫార్మసీ అంటే ఒకేసారి అనేక మందులు వాడటం. అవసరమైన చోట శాస్త్రీయంగా వాడాలని, అలవాటుగా లేదా భయంతో మందులు పెంచడం ప్రమాదకరమని సదస్సులో చర్చ జరిగింది. రోగులు సొంతంగా మందులు ఆపితే లక్షణాలు తిరిగి వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్ విశాల్ హెచ్చరించారు. నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి జాతీయ స్థాయి వేదికపై ఈ గుర్తింపు జిల్లా వైద్యరంగానికి గర్వకారణంగా నిలిచింది. డాక్టర్ విశాల్ అకుల గారు కంగ్రాట్స్..

# 34 ఏళ్ల ఉద్యమ జీవితానికి ముగింపు పలికిన సుశీల రాణి

- సీపీ ఎదుట లొంగిపోయిన మహిళా నక్సలైట్ సుశీల రాణి
- రూ.5 లక్షల చెక్కు, రూ.25 వేల తాత్కాలిక సహాయం

**దిశా నిర్దేశం, నిజామాబాద్:**



నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన సీనియర్ అండర్‌గ్రౌండ్ క్యాడర్, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్క సుశీల రాణి అలియాస్ లత (లలిత, రేలా, జ్యోతి, మాధవి, శ్వేత) నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య ఎదుట మంగళవారం లొంగిపోయారు. 34 ఏళ్ల అజ్ఞాత జీవితాన్ని ముగించి ఆమె జనజీవన స్రవంతిలోకి వచ్చారు.

నిజామాబాద్ సీపీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో ప్రెస్ మీట్ నిర్వహించిన సీపీ సాయి చైతన్య ఈ వివరాలు వెల్లడించారు. బోధన్ శక్కర్‌నగర్‌కు చెందిన సుశీల 1990 జూలైలో అప్పటి కంగాల్ దళం కార్యదర్శి సుంకర రామ్మోహన్ రావును వివాహం చేసుకుని, 1992 ఫిబ్రవరిలో సీపీఐ-ఎంఎల్ పీపుల్స్ వార్‌లో చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. హైదరాబాద్‌లో బీఎస్సీ పూర్తి చేసి, నాగార్జునసాగర్ ప్రభుత్వ బీఎడ్ కళాశాలలో చేరినా ఫైనల్ పరీక్షలు రాయలేదు.

1996లో ఏరియా కమిటీ సభ్యురాలిగా, 2002లో డివిజన్ కమిటీ సభ్యురాలిగా ఎదిగారు. అప్పటి ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. మొబైల్ అకడమిక్ స్కూల్, మొబైల్ పొలిటికల్ స్కూల్ వంటి విద్యా, రాజకీయ శిక్షణ బృందాల్లో పనిచేశారు. 2014 నుంచి 2025 జనవరి వరకు ఛత్తీస్‌గఢ్ మాడ్ డివిజనల్ కమిటీలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా కొనసాగారు.

1998లో నల్లమలలో కాల్పుల్లో ఎడమ కాలికి గాయమై, తొడ ఎముకకు రాడ్ పెట్టారు. ఆ తర్వాత మిలిటరీ వింగ్‌లో కొనసాగలేకపోయినా, అనారోగ్యం, గాయాల మధ్యనే మాడ్ ప్రాంతంలో అజ్ఞాత క్యాడర్‌గా పనిచేశారు. మొదటి భర్త రామ్మోహన్ రావు 2001లో నల్లమలలో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. 2004 మార్చిలో రాష్ట్ర కమిటీ సభ్యుడు సామల వెంకటేశ్వర్లు అలియాస్ మల్లన్నను వివాహం చేసుకున్నారు. ఆయన కూడా 2006లో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఆరోగ్య సమస్యలు, ప్రభుత్వ ఒత్తిడి పెరగడం వల్లే లొంగిపోయానని సుశీల పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు-పునరావాస విధానం ప్రకారం సీపీ సాయి చైతన్య ఆమెకు రూ.5 లక్షల చెక్కు, రూ.25 వేల తాత్కాలిక సహాయం అందించారు. మిగిలిన ప్రయోజనాలు కూడా అందుతాయని తెలిపారు.

ఈ ఏడాది ఇప్పటివరకు తెలంగాణలో 266 మంది అజ్ఞాత మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 3 మంది కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు, 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ క్యాడర్లు ఉన్నారు. సుశీల లొంగుబాటుతో పార్టీ పునర్నిర్మాణ సామర్థ్యం మరింత బలహీనపడిందని సీపీ అన్నారు.

ప్రస్తుతం తెలంగాణకు చెందిన ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) మాత్రమే బయటి రాష్ట్రాల్లో అజ్ఞాతంలో ఉన్నారని పోలీసులు తెలిపారు. మిగిలిన వారు కూడా ప్రభుత్వ పునరావాస పథకాన్ని వినియోగించుకుని ప్రధాన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు.

# బ్రిక్స్ విందులో శాఖాహారమే.. ఆతిథ్యమా, ఆంక్షా?




బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన గాలా విందులో కేవలం శాఖాహార వంటకాలనే వడ్డించడంపై సామాజిక మాధ్యమాల్లో చర్చ మొదలైంది. దేశ జనాభాలో దాదాపు డెబ్బై నుంచి ఎనభై శాతం మంది ఏదో ఒక రూపంలో మాంసాహారం తీసుకుంటున్నారని గణాంకాలు చెబుతున్న నేపథ్యంలో, అలాగే ప్రపంచంలో గేదె మాంసం ఎగుమతుల్లో భారత్ అగ్రస్థానంలో ఉన్న వాస్తవాన్ని ప్రస్తావిస్తూ, విదేశీ అతిథులకు కేవలం శాఖాహారం మాత్రమే పెట్టడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నను కొందరు లేవనెత్తుతున్నారు.

వాస్తవానికి ఇలాంటి అంతర్జాతీయ సదస్సుల్లో విందు మెనూను ఆతిథ్య దేశం తన సాంస్కృతిక ప్రతీకగా భావించి రూపొందిస్తుంది. భారతదేశం విషయానికి వస్తే అధికారిక కార్యక్రమాల్లో శాఖాహారానికే ప్రాధాన్యం ఇవ్వడం కొత్తేమీ కాదు. దీని వెనుక ఉన్న ప్రధాన ఆలోచన ఏమిటంటే శాఖాహారం అందరికీ ఆమోదయోగ్యమైనదిగా ఉండటం. మాంసాహారంలో హలాల్, కోషర్, గోమాంసం, పందిమాంసం నిషేధం వంటి మతపరమైన, సాంస్కృతిక సున్నితత్వాలు ఉంటాయి. శాఖాహారంతో ఆ ఇబ్బందులు తలెత్తవు. అంతేకాకుండా భారతీయ వంటకాల్లోని వైవిధ్యాన్ని, రుచిని ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశం కూడా ఇందులో ఉంటుంది. సౌదీ అరేబియా వంటి దేశాల్లో అధికారిక విందుల్లో మద్యం వడ్డించరు, అది ఆ దేశ సంస్కృతి. అలాగే భారత్ లో శాఖాహార విందు కూడా ఆతిథ్య దేశపు ఎంపికగా చూడాలి.

అయితే మరో కోణంలో చూస్తే ఈ వాదనలో కూడా బలం ఉంది. బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా వంటి దేశాల ప్రతినిధులకు మాంసాహారం నిత్య ఆహారంలో భాగం. వారికి కేవలం శాఖాహారం మాత్రమే అందించడం ఆతిథ్యంలో వైవిధ్య లోపంగా కనిపించవచ్చు. భారతీయుల్లోనే అత్యధికులు మాంసాహారులు అయినప్పుడు, భారతీయ వాస్తవికతకు దూరంగా కేవలం శాఖాహారాన్ని మాత్రమే చూపడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా అంతర్జాతీయ ప్రోటోకాల్ ప్రకారం ఇలాంటి విందుల్లో శాఖాహారంతో పాటు మాంసాహారపు విభాగాన్ని కూడా ఉంచి, ఎవరి ఇష్టాన్ని వారు ఎంచుకునే స్వేచ్ఛ ఇవ్వడం ఆనవాయితీ.

దీనిని బలవంతపు శాఖాహారంగా పేర్కొనడం కంటే ఆతిథ్య దేశం తన పద్ధతిని ప్రదర్శించడంగా భావించడం సముచితంగా ఉంటుంది. శాఖాహారం తినడం వల్ల ఎవరి విశ్వాసానికి భంగం కలగదు, ఆరోగ్యానికి హాని జరగదు. అదే సమయంలో అతిథుల అభిరుచిని గౌరవిస్తూ ఒకటి రెండు మాంసాహార వంటకాలను కూడా చేర్చి ఉంటే ఈ చర్చకు తావే ఉండేది కాదనే మాటను కూడా కొట్టిపారేయలేం.

**- వి. వి. ప్రసాదరావు**

## ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్

### దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగింపు



**దిశా నిర్దేశం,హైదరాబాద్:** బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి, వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లి"ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం"లికు దరఖాస్తుల స్వీకరణ గడువును 2026 సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1.19 లక్షల మంది అర్హులైన బీసీ మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు మంత్రి తెలిపారు.

ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 2026 సెప్టెంబర్ 30వ తేదీలోగా TGOBMMS పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

బీసీ మహిళలకు ఇంటి నుంచే స్వయం ఉపాధి పొందే అవకాశాలను కల్పించడం, తద్వారా వారి కుటుంబాల ఆదాయాన్ని పెంపొందించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని మంత్రి తెలిపారు.

పథకానికి సంబంధించిన సమాచారం అర్హులైన ప్రతి మహిళకు చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన వారందరూ గడువులోగా దరఖాస్తు చేసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు.




## ప్రతి బొట్టు ఒడిసిపట్టు

### మిర్ధపల్లీలో హర్ ఘర్ జల్ కార్యక్రమం




**దిశా నిర్దేశం, ఆర్మూర్:** ఆలూరు మండలం మిర్ధపల్లీ గ్రామంలో సర్పంచ్ యాల్ల సాయిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ జల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వర్షాభావం కారణంగా బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని, అందుకే ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు.

## నిర్దేశం చురకలు




నిజమెంతో విమర్శల్లో
నిగ్గు దేలదెప్పుడు
అసెంబ్లీలో మళ్లీ మళ్లీ
అదే మోగు చప్పుడు

అధికారం విపక్షాల్లో
అంతులేని హిపోక్రసీ
అబాసై పోతున్నది
అందుకొరకే డెమొక్రసీ



**- వేల్పుల నారాయణ**

# ఆధ్యాత్మిక కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా


**రాయ్‌బరేలీలో ఏయిమ్స్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు**



**దిశా నిర్దేశం, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త పండిత్ ప్రదీప్ మిశ్రాజీ నిర్వహించిన పవిత్ర 'శ్రీ శివ మహాపురాణ కథ' కార్యక్రమానికి గవర్నర్ హాజరయ్యారు.

అనంతరం రాయ్‌బరేలీ ఏయిమ్స్ లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ మంత్రి శ్రీ మనోజ్‌కుమార్ పాండే, ఏయిమ్స్ రాయ్‌బరేలీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అమితా జైన్‌తో కలిసి సంస్థ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఏయిమ్స్ అభివృద్ధిలో ఉద్యోగులు అందిస్తున్న అంకితభావంతో కూడిన సేవలను, వైద్య సేవలకు వారు చేస్తున్న విలువైన కృషిని గవర్నర్ అభినందించారు.



# లోక్‌భవన్‌లో పర్యావరణహిత గణపతి


లోక్ భవన్ దర్బార్ హాల్‌లో

**దిశా నిర్దేశం, హైదరాబాద్:** వినాయక చవితి సందర్భంగా లోక్ భవన్‌లో పర్యావరణహిత ఎకో ఫ్రెండ్లీ ప్లే వినాయకుడినీ ప్రతిష్ఠించారు. ప్రధానహౌజ్ తో పాటు దర్బార్ హాల్ లో రెండు చోట్ల గవర్నర్ సూచన మేరకు అధికారులు మట్టితో తయారుచేసిన విగ్రహాలను పూజించారు. సోమవారం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, వారి సతీమణి శ్రీమతి జానకి శుక్లాలు తొలి పూజ నిర్వహించారు. సోమవారం గవర్నర్ దంపతులు ఖైరతాబాద్ మహాగణపతి సందర్శించి విఘ్నేశ్వరుడికి తొలి పూజ నిర్వహించారు.


లోక్ భవన్ ప్రధాన హౌస్‌లో

# ఎల్లారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన రూట్, పెద్ద చెరువు పరిశీలించిన డిఎస్పి శ్రీనివాస్



**దిశా నిర్దేశం, కామారెడ్డి :** కామారెడ్డి జిల్లాఎల్లారెడ్డి పట్టణంలో జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా నిమజ్జన రూట్‌తో పాటు నిమజ్జనం నిర్వహించే పెద్ద చెరువును ఆర్డీవో ఎల్లారెడ్డి, డిఎస్పి ఎల్లారెడ్డి, సీఐ ఎల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎలక్ట్రికల్ ఏఈ , ఉత్సవ కమిటీ సభ్యులు మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా నిమజ్జన రూట్‌లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ సౌకర్యాలు, పారిశుధ్యం, పెద్ద చెరువు వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా మరియు సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



అమెరికా ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స అనంతరం స్వదేశానికి వచ్చిన 'స్పందన, తల్లిదండ్రులు.. మంగళవారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.. **- దిశా నిర్దేశం, మంచిర్యాల**

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

- **ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్‌తో సీఎం రేవంత్**

**దిశా నిర్దేశం, హైదరాబాద్:**



తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా మరింత సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని కోరారు.

భారత పర్యటనలో ఉన్న ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందని పేర్కొంటూ, హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఫౌండేషన్ సహకారంతో ఇటీవల శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించడం, అలాగే నగరంలోని కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

హైదరాబాద్ నగర పునర్నిర్మాణంలో భాగంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై సిద్ధం చేసిన ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. మూసీ నది వెంట నైట్ ఎకానమీ కార్యకలాపాల దిశగా తీర్చిదిద్దుతున్న విషయాలను తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో సహకరించాలని కోరారు.

ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుత ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు వివరించారు. డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ఎ గారిని ముఖ్యమంత్రి గారు ఆహ్వానించారు. సమ్మిట్‌కు 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై ప్రిన్స్ ఆగా ఖాన్ ఆసక్తిని కనబరిచి దాని ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, అంతర్జాతీయ విమానాశ్రయానికి 20 నిమిషాల దూరంలో నిర్మించే ఫ్యూచర్ సిటీ పూర్తిగా నెట్-జీరో సిటీగా ఉండబోతోందని ముఖ్యమంత్రి తెలిపారు.

సింగపూర్‌కు చెందిన కంపెనీ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తోందని, ఇందులో దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వంటి సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయని గుర్తుచేస్తూ 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు.

ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు సమావేశంలో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కి వివరించారు.

హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్ లో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి అంగీకరించాయని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా కోరారు. పర్యాటక రంగంలో అగా ఖాన్ ఫౌండేషన్ పాత్రను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ గారు గుర్తుచేస్తూ భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని కోరారు.

ఈ సమావేశంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు ఉన్నతాధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలీసు పదోన్నతులపై డీజీపీ సీరియస్

**పదోన్నతులసమస్యల పరిష్కారం కోసం డీజీపీ సమీక్ష**

**దిశా నిర్దేశం, హైదరాబాద్ :**




**1991,** 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన అధికారులు, అలాగే 1998 బ్యాచ్‌కు చెందిన కొంతమంది అధికారులు ప్రస్తుతం డీఎస్పీలు, అదనపు ఎస్పీలుగా పనిచేస్తున్నారు. పదోన్నతులకు ఖాళీలు అందుబాటులో ఉన్నప్పటికీ, వీరు చాలా సంవత్సరాలుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. సీనియారిటీ వివాదాలు, కోర్టు కేసులు, జోనల్ సమస్యలు, ఇతర పరిపాలనా అంశాలు సంవత్సరాలుగా కొనసాగడంతో ఈ పదోన్నతుల వ్యవహారం మరింత సంక్లిష్టంగా మారింది.

డీజీపీ గతంలో హోంశాఖ కార్యదర్శిగా ఉన్నప్పుడు వీరిలో కొందరి వినతులను పరిశీలించారు. ఈ సమస్యకు న్యాయమైన, శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయత్నిస్తూ ఉన్నారు. ప్రస్తుతం కోర్టుల్లో ఉన్న కేసులు పరిష్కారమవ్వడం దాదాపు అసాధ్యంగా మారిన నేపథ్యంలో, ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించేందుకు ఇటీవల ఒక కమిటీని ఏర్పాటు చేశారు.

వరంగల్, హైదరాబాద్ సిటీ, హైదరాబాద్ రేంజ్‌లకు చెందిన అధికారులతో సమావేశమై, ప్రస్తుతం ఉన్న నిబంధనలు, కమిటీ పరిశీలనలను వారికి వివరించారు. పరస్పర విభేదాలు తమ కెరీర్‌పై ప్రభావం చూపకుండా చూసుకోవాలని వారికి సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ న్యాయపోరాటం కారణంగా, వీరందరూ అదనపు ఎస్పీలు లేదా నాన్-కేడర్ ఎస్పీలుగా కాకుండా డీఎస్పీలుగానే పదవీ విరమణ చేసే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో అదనపు ఎస్పీ స్థాయి 37 పోస్టులు కోర్టుల స్టే ఆదేశాల కారణంగా ఖాళీగా ఉన్నాయి. అందువల్ల, తమ కేసులను ఉపసంహరించుకుని, సీనియారిటీ మరియు నిబంధనల ప్రకారం అందరికీ దశలవారీగా పదోన్నతులు కల్పించేందుకు తన పై , కమిటీ పై నమ్మకంతో ముందుకు రావాలని వారందరికీ డీజీపీ గారు సూచించారు.

రోజంతా అధికారుల మధ్య జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం, వారు ఒక అవగాహనకు వచ్చారు. తమ అభిప్రాయాలను ఒక వారం రోజుల్లోగా తెలియజేసేందుకు అంగీకరించారు. వారు తమ కేసులను ఉపసంహరించుకోవడానికి అంగీకరిస్తే, పదోన్నతులకు మార్గం సుగమం అవుతుంది.



# పేకాట స్థావరంపై దాడి

**నలుగురు అరెస్ట్**



**దిశా నిర్దేశం, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాసదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డబ్బులు పణంగా పెట్టి పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సదాశివనగర్ ఎస్సై పుష్పరాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి సంతోష్ రెడ్డి పౌల్ట్రీ ఫామ్‌పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2,080 నగదు, 4 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ మాట్లాడుతూ, జూదం చట్టరీత్యా నేరమని, ప్రజలు జూదానికి దూరంగా ఉండాలని సూచించారు. "మీ పిల్లల బంగారు భవిష్యత్తుపై దృష్టి పెట్టండి. సమయం చాలా విలువైనది. జూదానికి సమయాన్ని కేటాయించకుండా, మీ పిల్లల భవిష్యత్తుకు పునాది వేయడానికి మీ సమయాన్ని కేటాయించండి" అని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూదానికి తావు లేదని, జూదానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై పుష్పరాజు హెచ్చరించారు.

# శోభాయాత్ర మార్గాల పరిశీలన

**ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నగర సీపీ సజ్జనర్ బస్సు యాత్ర**

**దిశా నిర్దేశం, హైదరాబాద్:**

వినాయక నిమజ్జన శోభాయాత్ర వేళ నగరంలో భక్తులకు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పోలీస్, జీహెచ్ఎంసీ, హైడ్రా , ఆర్ అండ్ బి ఉన్నతాధికారుల బృందం సంయుక్తంగా క్షేత్రస్థాయిలో రూట్ ఇన్‌స్పెక్షన్ చేపట్టింది. బాలాపూర్ గణనాథుడి సన్నిధి నుంచే మంగళవారం ఉన్నతాధికారులంతా కలిసి ప్రత్యేకంగా బస్సు యాత్ర ప్రారంభించి, శోభాయాత్ర సాగే ప్రధాన రహదారులు, అక్కడ చేపట్టిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

అంతకుముందు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్, ఐపీఎస్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఐపీఎస్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాదు కలెక్టర్ డా.ప్రియాంక ఆలా ఐఎఎస్, తదితరులు బాలాపూర్ గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాపూర్ వినాయక ఉత్సవ సమితి నిర్వాహకులు కళ్ళెం నిరంజన్ రెడ్డి, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవసమితి వారు జి.రాఘవ రెడ్డి, ఆర్.శశిధర్‌లు ఉన్నతాధికారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

అనంతరం సీపీ సజ్జనర్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు గణేష్ చతుర్థి శుభాకాంక్షలు తెలిపారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, స్థానిక నిర్వాహకులు దశాబ్దాలుగా ప్రభుత్వానికి, పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారని కొనియాడారు.

నిమజ్జనం రోజున నగరవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా దాదాపు 20 వేల మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నగరమంతటా విస్తరించి ఉన్న సీసీటీవీ కెమెరాల ద్వారా పరిస్థితిని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు.

ఈసారి బాలాపూర్‌లో పూరీ జగన్నాథ ఆలయ నమూనాతో గణనాథుని మండపాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దారని ఉత్సవ సమితి సభ్యులను అభినందించారు.

దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన హైదరాబాద్ శోభాయాత్రను విజయవంతం చేసేందుకు నగర ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీసు శాఖకు సంపూర్ణ



సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ ఊరేగింపు మార్గమును బాలాపూర్ గణేష్ మండపము నుండి ప్రారంభమై, మొత్తం 19 కి.మీ. పొడవున ఉన్న ఈ మార్గంలో చంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, చార్మినార్, ఎం.జే. మార్కెట్ మరియు తెలుగు తల్లి ఫ్లైఓవర్ వరకు తనిఖీ నిర్వహించారు. గణేశ్ ఉత్సవాల గురించి గత నెలరోజులుగా అన్ని శాఖల సమన్వయముతో పనిచేస్తూ ముందుకు వెళ్ళుతున్నాము అని తెలిపారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు మార్గంలో అధికారుల బృందం రాజేష్ మెడికల్ హాల్, గుల్జార్ హౌస్, ఎం.జే. మార్కెట్ జంక్షన్, తెలుగు తల్లి జంక్షన్ వద్ద ఆగి నిశితంగా పరిశీలించారు. ప్రతి జోన్ అధికారులు తమ పరిధిలోని విగ్రహాలను సకాలంలో నిమజ్జనానికి బయలుదేరే విధంగా చూడాలని తెలిపారు. ప్రస్తుతము వర్షాలు పడుతున్నందున విద్యుత్తు షాక్ గురి అయ్యే అవకాశము ఉన్నందున మండప నిర్వాహకులకు అందరికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు జారీచేసినాము అని తెలిపారు.

గణేష్ విగ్రహాల ఊరేగింపు మార్గంలో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు, యాంటీ-చైన్ స్నాచింగ్ బృందాలు, షీ టీమ్‌లను కూడా మోహరించనున్నామని తెలిపారు. నిమజ్జనము రోజున జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ, వాటర్ వర్క్స్, ఆర్‌టీఏ, వైద్య మరియు ఆరోగ్య శాఖ వంటి విభాగాల సీనియర్ అధికారులు ఉమ్మడి కమాండ్ కంట్రోల్ సెంటర్ టీజీఐసీసీసీలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఈ సంవత్సరం గణేష్ విగ్రహాల ఊరేగింపు మరియు నిమజ్జనం సందర్భంగా ఎలాంటి చిన్న సంఘటన కూడా జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రజలు, భక్తులు ఊరేగింపు, నిమజ్జనం సమయంలో పోలీసు వారితో సహకరించాలని కోరారు.



## హౌసింగ్ ఫర్ ఆల్ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక

- 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలి
- కేంద్ర సహకారంతో ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌ల నిర్మాణం
- గృహ నిర్మాణ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం



**దిశా నిర్దేశం, అమరావతి:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమాన్ని సంతృప్తి స్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గృహ నిర్మాణ శాఖపై క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, పీఎం జన్ మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణాన్ని వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 1.5 లక్షల ఇళ్లను పట్టణ ప్రాంతాల్లోనూ నిర్మాణం చేయాలని సీఎం సూచించారు. డిసెంబరు 2026 నాటికల్లా 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. పీఎంఏవై 1.0, పీఎంఏవై 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద రాష్ట్రంలో 18.72 లక్షల ఇళ్ల మంజూరు కాగా.. ఇప్పటి వరకూ 13.20 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ పరిధిలో మొత్తం 16.11 లక్షల ఇళ్లకు గానూ ఇప్పటికే 11.31 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గానూ 1.88 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని సీఎంకు వివరించారు. 2027 డిసెంబరు నాటికి 75 వేల కొత్త గృహాలను మంజూరు అయ్యేలా చూడటంతో పాటు 1.5 లక్షల ఇళ్లను పైప్ లైన్ లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనికి సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన కేటాయింపులు పొందాలని సీఎం స్పష్టం చేశారు.

### ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ

ఇంటి స్థలాలు లేని కుటుంబాల వాస్తవ డిమాండ్‌ను గుర్తించేందుకు ఆర్టీజీఎస్ సహా ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖల నుంచి డేటాను అనుసంధానం చేసుకుని డూప్లికేషన్ లేకుండా అర్హులను గుర్తించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక లబ్ధిదారుల జాబితాలను ప్రచురించి అభ్యంతరాలను స్వీకరించి పారదర్శకంగా పరిష్కరించిన అనంతరం తుది జాబితాలను ఖరారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లే అవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరానికి అనుగుణంగా 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఖాళీ స్థలాల గుర్తింపు, అర్హులైన లబ్ధిదారులకు మ్యాపింగ్, నిర్మాణం పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సీఎం సూచించారు. కుప్పం నియోజకవర్గంలోనూ సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయంతో అందరికీ ఇళ్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

### పారిశ్రామిక టౌన్ షిప్‌ల నిర్మాణం

కేంద్ర సహకారంతో వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక టౌన్ షిప్ లను నిర్మించే అంశంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. రాష్ట్రంలోని శ్రీసిటీ సహా వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని ఈ టౌన్ షిప్ ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, హౌసింగ్ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఇద్దరి పిల్లల తల్లి సహజీవనం.. అనుమానాస్పదస్థితిలో మృతి..

### - ప్రియురాలి ఫోన్‌తో ప్రియుడు పరారీ



భర్తను వదిలి వేరొకరితో సహజీవనం చేస్తున్న ఓ వివాహి త అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన చిక్కబళ్లాపురం తాలూకా పరిధిలోని చొక్కహళ్లి గ్రామంలో కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసు లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

చిక్కబళ్లాపురం తాలూకా ఇనమించేనహళ్లికి చెందిన చైత్ర(28) అనే వివాహిత సుమారు 8 సంవత్సరాల నుంచి భర్తకు దూరంగా ఉంటోంది. ఆమెకు 10, 12 సంవత్సరాల వయసు గల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా ఆమె చొక్కహళ్లి గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటోంది. ఈ క్రమంలోనే మంచనబలెకు చెందిన షబ్బీర్ అనే వ్యక్తితో ఆమె సన్నిహితంగా ఉంటూ, అతడితో సహజీవనం సాగిస్తున్నట్లు తేలింది.

అయితే ఇటీవల కాలంలో ఇద్దరి మధ్య తరచూ మనస్పర్థలు తలెత్తడం, గొడవలు జరుగుతుండటం గమనించినట్లు స్థానికులు చెబుతున్నారు. ముందుగా చైత్రను తీవ్రంగా కొట్టి, ఆ తర్వాత ప్రియుడే ఉరివేసి హత్య చేశాడని ఆమె బంధువులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. తానేమీ ఎరుగనట్లుగా ఆమెను చిక్క ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నానంటూ, మార్గమధ్యలోనే చనిపోయిందని ప్రియుడు షబ్బీర్ పెద్ద నాటకం ఆడాడని వారు వాపోయారు. ఆస్పత్రికి చేర్చిన వెంటనే అతడు చైత్ర మొబైల్ ఫోన్‌ను తీసుకుని పరారీ కావడం ఈ ఘటనపై మరింత అనుమానాలకు తావిస్తోంది.

మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు నందిగిరి ధామ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న షబ్బీర్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

- నాగయ్య భూపాతి

# దేశం, రాష్ట్రం సిరిసంపదలతో వర్ధిల్లాలి

**ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు**

**శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి**

**దిశా నిర్దేశం, తిరుమల:**

దేశం, రాష్ట్రం సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని శ్రీవేంకటేశ్వరస్వామివారిని ప్రార్థించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన మంగళ వారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వర స్వామివారికి ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీవారికి 15 వసారి పట్టువస్త్రాలు సమర్పించే మహద్భాగ్యం లభిం చడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా నిలిచి, అభివృద్ధిలో ముందుండేలా స్వామివారు ఆశీస్సులు అం దించాలని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. శ్రీవారి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

టీటీడీ పాలకమండలి, అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో భక్తులకు సేవలందిస్తున్నారని ముఖ్యమంత్రి అభినందించారు. మన ఆధ్యాత్మిక సంపద, సనాతన సంప్రదాయాలు, సంస్కృతిని రాబోయే తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.





### భక్తిశ్రద్ధలతో శ్రీవారి దర్శనం

ముందుగా ముఖ్యమంత్రి బేడి ఆంజనేయస్వామివారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు.

ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం ముఖ్య మంత్రి శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు.

అనంతరం వకుళామాత, విమాన వేంకటేశ్వర స్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు.

తరువాత రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో ముఖ్యమంత్రిని ఆశీర్వదించారు. టీటీడీ ఛైర్మన్, ఈవో, అడిషనల్ ఈవోలు ముఖ్యమంత్రికి శ్రీవారి చిత్రపటాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

### 2027 టీటీడీ డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ

ఈ సందర్భంగా 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీలు, క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

అనంతరం శ్రీవారి పెద్దశేష వాహన సేవలో ముఖ్యమంత్రి పాల్గొని స్వామివారి వైభవాన్ని దర్శించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర మానవ వనరులు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, టీటీడీ పాలకమండలి సభ్యులు,

జిల్లా కలెక్టర్ ఎస్. వేంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో కె.వి. మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పడమే రేవంత్ ట్రేడ్ మార్క్

**సమస్యలు తీర్చాలని అడిగితే ఉద్యోగులు, ఉపాధ్యాయులను బెదిరిస్తున్నడు**

**ఉద్యోగులంటే మీ బానిసలు కాదని గుర్తు పెట్టుకోండి**

**ఈ నెల 18 లోగా వారికిచ్చిన హామీలు నెరవేర్చాలి**

**లేదంటే హైదరాబాద్ దిగ్బంధానికి ఉద్యోగ సంఘాలు సిద్ధం కావాలి**

**వారి పోరాటానికి అన్ని విధాలుగా టీఆర్ఎస్ మద్దతుగా నిలుస్తుంది**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**




**దిశా నిర్దేశం, హైదరాబాద్ :**

మాట తప్పడం, మడమ తిప్పడం రేవంత్ రెడ్డి ట్రేడ్ మార్క్ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ఆయన విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో మంగళవారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ఉద్యోగులను రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి బెదిరింపులకు భయపడేం దుకు ఉద్యోగులు బానిసలు కాదన్న విషయం గుర్తు పెట్టు కోవాలన్నారు. ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాలేదని, కాంగ్రెస్ సర్కార్ పని కూడా అయిపోయిందని తేల్చిచెప్పా రు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చాక ఉద్యో గులు సంతోషంగా, గౌరవంగా ఉండేలా చూస్తామని, వాళ్లను అభివృద్ధిలో డెవలపర్స్‌గా చేస్తామన్నారు.

### అది రేవంత్ ట్రేడ్ మార్క్

ఉద్యోగులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడం లేదని అన్నారు. ఉద్యోగులకు ఇచ్చే డీఏలు, పీఆర్సీ, పెన్షన్లు, రిటైర్ మెంట్ బెనిఫిట్స్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవే సమస్యలపై గత ప్రభుత్వాన్ని ఇష్టమొచ్చినట్లు తిట్టిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు ఎందుకు మేలు చేయడం లేదని ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ఉద్యోగులను బెదిరిస్తూ వాళ్ల నోరు మూయించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సీఎం బెదిరింపులకు భయపడేందుకు వాళ్లు బానిసలు కాదని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలను అడిగే విషయంలో ఉద్యోగులు భయపడాల్సిన అవసరం లేదని కవిత భరోసా ఇచ్చారు. తల్లి కాంగ్రెస్ తోనే పోరాడి తెలంగాణ తెచ్చుకున్న మనకు ఈ పిల్ల కాంగ్రెస్ తో పోరాటం చేయడం ఓ లెక్క కాదు అని అన్నారు. ఉద్యోగులకు గత 32 నెలలుగా ఆరు డీఏలు బకాయిలు పెట్టారని అన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ఇవ్వాల్సిన కరవు భత్యాన్ని ఈ ముఖ్యమంత్రే మింగేశారన్నారు. ఏ ప్రభుత్వమైనా పారదర్శకమైన పాలన అందించాలంటే అందుకు ప్రభుత్వ ఉద్యోగులదే కీలక పాత్ర అని కవిత చెప్పారు. అలాంటి ప్రభుత్వ ఉద్యోగులను చిన్న చూపు చూస్తూ వారి పట్ల రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట తప్పడం, మడమ తిప్పడం అనేది రేవంత్ రెడ్డి ట్రేడ్ మార్క్ అని కవిత విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

### టీచర్లతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ గెలవలేదు

ప్రభుత్వ టీచర్లు, ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మళ్లీ గెలవలేదని కవిత గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ కూడా మళ్లీ గెలవదని కవిత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క టీచర్, ప్రభుత్వ ఉద్యోగి కూడా సంతో షంగా లేరని చెప్పారు. ముఖ్యంగా టీచర్ల విషయంలో ప్రభుత్వ వైఖరి అమానుషంగా ఉందన్నారు. వారికి ఇవ్వాల్సిన ప్రమోషన్లు ఇవ్వటం లేదని, డీఏ బకాయిలు పెండింగ్ పెడుతున్నారన్నారు. పైగా ఎప్పుడు ఏదో రిపోర్ట్ పేరుతో వాళ్లు చదువు చెప్పకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 40 శాతం పోస్టులు ఖాళీలు ఉంటే వాటిని భర్తీ చేయకుండా ఉన్న టీచర్లను సరిగా చూసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2003 లో రిక్రూట్ అయిన టీచర్లకు ఓపీఎస్ అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. వారి పెన్షన్ విధానాన్ని ఓపీఎస్ కు బదిలీ చేస్తే ప్రభుత్వానికి రూ. 2 వేల కోట్లు వస్తాయని చెప్పారు. ఈ విషయం కూడా ముఖ్యమంత్రి తెలియదని కవిత ఎద్దేవా చేశారు. వెంటనే వారిని ఓపీఎస్ కు మార్చి వచ్చే 2 వేల కోట్లతో ప్రభుత్వ టీచర్లు, ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని కవిత డిమాండ్ చేశారు.

### 18 లోగా సమస్యలు పరిష్కరించాలి

ఎన్నికలకు ముందు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడని కవిత మండిపడ్డారు. కనీసం ఉద్యోగుల హెల్త్ కార్డు కూడా పనిచేయని పరిస్థితి ఉందన్నారు. ఏ ప్రైవేట్ హాస్పిటల్ లోనైనా హెల్త్ కార్డు చెల్లుబాటు అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చెప్పిన చేసేందుకు టీఆర్ఎస్ సిద్ధంగా ఉందని కవిత అన్నారు. ఒకవేళ హెల్త్ కార్డు పనిచేయకపోతే ఈ ముఖ్యమంత్రి రాజీనామా చేస్తారా అంటూ కవిత ఛాలెంజ్ విసిరారు. పోలీసుల పరిస్థితి కూడా బాగాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి రావాల్సిన ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని... 2003లో రిక్రూట్ అయిన వారికి ఓపీఎస్ పెన్షన్ సిస్టం అమలు చేయాలన్నారు. ఏ ప్రభుత్వంలోనైనా ప్రభుత్వ ఉద్యోగులు సంతోషంగా లేకుంటే పరిపాలన ఎక్కడికక్కడ పడకేస్తుందన్నారు. రాష్ట్రంలోని 206 ఉద్యోగ సంఘాలు జేఏసీ గా ఏర్పడి ప్రభుత్వం ముందుంచిన 37 డిమాండ్లలో చాలా వరకు డబ్బుతో సంబంధం లేనివేనని అన్నారు. 317 జీవో సహా చాలా సమస్యలను ప్రభుత్వం సులభంగా పరిష్కరించే పరిస్థితి ఉన్నప్పటికీ పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఉద్యోగ సంఘాలు కూడా ప్రభుత్వానికి భయపడి ధర్నాలను పోస్ట్ పోన్ చేసుకుంటుండంతో కిందిస్థాయి ఉద్యోగుల్లో ఉద్యోగ సంఘాలపై నమ్మకం లేకుండా పోతోందన్నారు. తమ డిమాండ్ల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లో భయపడాల్సిన అవసరం లేదని కవిత భరోసా ఇచ్చారు. ఈ నెల 18 లోగా సమస్యలు పరిష్కారిస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీని కవిత గుర్తు చేశారు. ఒక వేళ 18 వ తేదీ లోగా సమస్యలు పరిష్కారం కాకపోతే హైదరాబాద్ దిగ్భంధనానికి ఉద్యోగ సంఘాలు పిలుపునివ్వాలని కవిత కోరారు. వారికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన రానున్న రోజుల్లో కచ్చితంగా అధికారంలోకి వస్తుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు ప్రభుత్వ ఉద్యోగులను డెవలపర్స్ పార్టనర్స్ చేస్తామన్నారు. వారంతా సంతోషంగా ఉండేలా వారిని గౌరవించుకుంటామన్నారు.

### ఉద్యోగ సంఘాలు కూడా నష్టం చేస్తున్నయ్

ఉద్యోగులకు మేలు చేయాల్సిన సంఘాలు కూడా ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి నష్టం చేస్తున్నాయని టీఎస్టీయూ స్టేట్ ప్రెసిడెంట్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాల కోసం అడిగితే కేసులు పెట్టారని.. ఈ ప్రభుత్వంలో అన్ని ఇస్తామంటూ ఏమీ ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కవిత ఆధ్వర్యంలో టీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్న నమ్మకం తమకుందని ఆయన చెప్పారు. అటు ఆర్టీసీ లో ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి ఉందని.. దాదాపు 16 గంటలు వారితో పనిచేయిస్తున్నారన్నారని ఆర్టీసీ ఉద్యోగుల సంఘాల నాయకులు సంజవ్ చెప్పారు. ఈ విధానం మారే విధంగా పోరాటం చేయాలని కవితకు ఆయన విజ్ఞప్తి చేశారు.

చిన్న చిన్న కారణాలకే ఉద్యోగాల నుంచి తొలగించిన చాలా మందిని కవిత పోరాటం కారణంగానే మళ్లీ ఉద్యోగాలకు తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. ఐతే ఆర్టీసీ లో శ్రమ దోపిడీ లేకుండా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, టీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్రీనివాస్, కనిష్క మహేందర్ రెడ్డి, విద్యావేత్త ధరణి రాణి పాల్గొన్నారు.





## పనస పండ్ల పేరుతో గంజాయి రవాణా..



దిశా నిర్దేశం, కామారెడ్డి: పనస పండ్ల మాటున రూ.1.93 కోట్ల విలువైన గంజాయిని అక్రమంగా రవాణా చేసిన కేసులో ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులపై కామారెడ్డి పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. జూన్ 20న ఒడిశా నుంచి మహారాష్ట్రలోని నాసిక్ కు భారీగా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు జాతీయ రహదారి-44 పై తనిఖీలు చేపట్టారు. క్యాసంపల్లి శివారులోని రాయల్ ధాబా సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనాన్ని తనిఖీ చేయగా పనస పండ్ల కింద దాచిన 387.128 కిలోల గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ.1,93,56,400గా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అప్పట్లోనే అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.


పీడీ యాక్ట్ కింద నిర్బంధించిన వారిలో ఒడిశా రాష్ట్రం కంధమాల్ జిల్లాకు చెందిన రాజు అలియాస్ రాజ్ కిషోర్ ప్రధాన్, దీపక్ అలియాస్ దీపక్ ప్రధాన్ ఉన్నారు. వీరు గంజాయి సరఫరా ద్వారా యువత పై తీవ్ర ప్రభావం చూపే నేరాలకు పాల్పడుతుండటంతో ప్రజా శాంతి భద్రతల పరిరక్షణ కోసం పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల అక్రమ రవాణా యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా, వాహన తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ ను కచ్చితంగా అమలు చేస్తామని, గంజాయి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు, డయల్ 112 కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# సౌదీ చమురు సౌకర్యాలపై హౌతీ దాడులు

## దక్షిణ సౌదీలో మంటలు.. గల్ఫ్‌లో పెరిగిన ఉద్రిక్తత

(దిశా నిర్దేశం గల్ఫ్ ప్రతినిధి వేణుగోపాల్ బోగ)





పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. యెమెన్‌కు చెందిన హౌతీలు సౌదీ అరేబియా దక్షిణ ప్రాంతంలోని చమురు, ఇంధన సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేశారు. జీజాన్, అభా, నజ్రాన్, ఖమీస్ ముషైత్ వంటి ప్రాంతాల్లో కొన్ని సౌకర్యాల వద్ద మంటలు చెలరేగి, కొన్ని కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోయినట్లు సౌదీ అధికారులు తెలిపారు.

సౌది అరమ్కో కు సంబంధించిన సౌకర్యాలపై దాడుల ముప్పు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను కూడా కదిలిస్తోంది. ఇప్పటికే ప్రాంతీయ భద్రతపై ప్రపంచం నిశితంగా గమనిస్తోంది.


### చమురు మార్గాలపై ఒత్తిడి

పర్షియన్ గల్ఫ్ నుంచి ఎర్ర సముద్రం వైపు చమురు తరలించే పైప్‌లైన్లు, నిల్వ కేంద్రాలు దెబ్బతింటే సరఫరాపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. జీజాన్, నజ్రాన్, అభా వంటి దక్షిణ సౌదీ ప్రాంతాలు గతంలోనూ హౌతీ దాడుల పరిధిలోకి వచ్చాయి.

ఎర్ర సముద్రం-బాబ్ అల్-మండబ్ మార్గంలో భద్రతా సమస్యలు పెరిగితే చమురు, వాణిజ్య రవాణాపై అదనపు ఒత్తిడి పడవచ్చు. దీనివల్ల ఇంధన ధరలు, రవాణా ఖర్చులు ప్రభావితమయ్యే అవకాశాన్ని మార్కెట్లు గమనిస్తున్నాయి.

### ప్రాంతీయ పోటీ నీడ

హౌతీలు, యెమెన్‌లో కొనసాగుతున్న ఘర్షణ, ఇరాన్-సౌదీ మధ్య ప్రాంతీయ పోటీ-ఇవన్నీ పశ్చిమాసియా పరిస్థితిని సంక్లిష్టం చేస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో చిన్న స్థాయి దాడి కూడా పెద్ద ఉద్రిక్తతగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు అంటున్నారు.



### తెలంగాణ గల్ఫ్ కుటుంబాలకు స్పష్టమైన మాట

ఈ వార్తల నేపథ్యంలో సౌదీతో పాటు యూఏఈ, ఒమన్, కువైట్, ఖతర్, బహ్రెయిన్‌లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికుల కుటుంబాల్లో ఆందోళన రావడం సహజం. కానీ ప్రతి దాడి వార్తను మొత్తం గల్ఫ్ ప్రాంతం యుద్ధంలోకి జారినట్లుగా భావించాల్సిన అవసరం లేదు.

గల్ఫ్ దేశాలు తమ భద్రతా వ్యవస్థలను అప్రమత్తంగా ఉంచుతున్నాయి. కార్మికులు స్థానిక అధికారుల సూచనలు పాటించడం, అవసరం లేని ప్రయాణాలు తగ్గించడం, అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మడం ముఖ్యం.

### కుటుంబాలకు విజ్ఞప్తి

వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న తల్లిదండ్రులు, భార్యలు, పిల్లలు ప్రతి వార్తతో కలవరపడడం అర్థమయ్యే విషయమే. అయితే సోషల్ మీడియాలో వచ్చే ధృవీకరణ లేని వీడియోలు, పాత దృశ్యాలు, వదంతులను నమ్మి భయపడవద్దు.

గల్ఫ్‌లో ఉన్న కార్మికులు కుటుంబాలతో క్రమం తప్పకుండా మాట్లాడాలి. అత్యవసర పరిస్థితిలో కంపెనీ యాజమాన్యం, స్థానిక అధికారులు, భారత రాయబార కార్యాలయాల సూచనలనే పాటించాలి.

గల్ఫ్ కార్మికుడు కేవలం ఒక వ్యక్తి కాదు. అతని వెనుక ఒక కుటుంబం, ఒక ఊరు, ఒక రాష్ట్రం ఉంది. అందుకే ఏ ఉద్రిక్తత వచ్చినా కార్మికుల భద్రతను ప్రథమ ప్రాధాన్యంగా చూడాలి.

### భయం కాదు.. అప్రమత్తతే కావాలి

చమురు సౌకర్యాల వద్ద ఎగిసే మంటలు ప్రపంచానికి హెచ్చరిక కావచ్చు. కానీ గల్ఫ్‌లో ఉన్న సాధారణ ప్రజలు, ముఖ్యంగా భారతీయ కార్మికుల్లో భయాన్ని నింపే వదంతులు మరింత ప్రమాదకరం.

యుద్ధం ఎవరి మధ్య జరిగినా, దాని భారం సామాన్యుడిపైనే పడుతుంది.

అందుకే శాంతి కావాలి. భద్రత కావాలి. కార్మికుల ప్రాణాలకు రక్షణ కావాలి.

## వినాయక మండపాలకు సౌండ్ సిస్టం అందజేత..



**దిశా నిర్దేశం, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా. ఎన్నికల హామీ మేరకు 8వ వార్డు పరిధిలో గూడెం గణేష్ మండలికి, కాంట్రపల్లి ఆధ్వర్యంలోని గణేష్ మండలికి వేలాది రూపాయల విలువైన యాంప్లిఫైయర్ సౌండ్ సిస్టంను అందజేశారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన పది రోజుల్లోనే తన సొంత మేనిఫెస్టోను అమలు చేసి ప్రజల మన్ననలు పొందారు. వార్డు పరిధిలోని ఓటర్లకు ఆడపిల్ల జన్మిస్తే రూ.10,000, ఆడపిల్ల వివాహానికి రూ.11,000, ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు రూ.10,000, వార్డు ప్రజల కోసం బాడీ ఫ్రీజర్ కోసం బాడీ డీఫ్రిజిరేటర్, వార్డులో బోరుబావి తవ్వించి మోటార్ ఏర్పాటు చేస్తానని హామీలు ఇచ్చారు. పైన పేర్కొన్న హామీలన్నింటినీ ఇప్పటికే అమలు చేశారు. ఎన్నికల తర్వాత మొట్టమొదటిసారిగా వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో ఆ రెండు గణేష్ మండపాలకు యాంప్లిఫైయర్ సౌండ్ సిస్టంను సైతం వేలాది రూపాయలు ఖర్చు చేసి అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కే నేటి రాజకీయ నాయకులకు విరుద్ధంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న సిద్ధి శ్రీధర్ గుప్తాను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

# డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫెలోస్ తొలి బ్యాచ్ పూర్తి..

## అభినందనలు తెలిపిన రాహుల్ గాంధీ





**దిశా నిర్దేశం, ఢిల్లీ :**

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి పేరు మీద నిర్వహిస్తున్న 'మన్మోహన్ సింగ్ ఫెలోస్' తొలి బ్యాచ్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీలోని ఇందిరా భవన్ లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారు, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ ప్రియాంక గాంధీ గారు, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్ మధుయాష్కి గౌడ్ గారు, మాజీ చైర్ పర్సన్ ప్రవీణ్ చక్రవర్తి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ గారు.. శిక్షణ పూర్తి చేసుకున్న మన్మోహన్ సింగ్ ఫెలోస్‌తో మాట్లాడి వారితో అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రగతిశీల భారత నిర్మాణం పట్ల వారు చూపుతున్న ఆసక్తి, అభిరుచిని అభినందించారు.

ఈ సందర్భంగా డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి ఆలోచనలు, విధానాలు, దేశాభివృద్ధిలో ప్రొఫెషనల్స్ పాత్ర వంటి అంశాలపై చర్చ జరిగింది. దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్స్‌ను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేయడం, ఏఐపీసీని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై కూడా నాయకులు చర్చించారు.

'డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫెలోస్' రెండో బ్యాచ్ కోసం దరఖాస్తుల ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. దేశ ప్రగతి, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, అభివృద్ధిపై ఆసక్తి ఉన్న యువతతో పాటు వివిధ రంగాల్లోని వృత్తిని నిపుణులు, మేధావులు ఈ ఫెలోస్ లో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు.

## మంత్రి సీతక్కకు ముంబై ఉద్యమకారుల నివేదిక

**దిశా నిర్దేశం, హైదరాబాద్:** ముంబైలోని తెలంగాణ ఉద్యమకారులకు కెకె కమిటీ ద్వారా గుర్తింపు ఇవ్వాలని మంగళవారం మధ్యాహ్నం నిజామాబాద్ జిల్లా (మోర్తాడ్)కు మంత్రి సీతక్క విచ్చేసిన సందర్భంగా ఎంటిజెఏసి తరుపున విజ్ఞప్తి పత్రం అందజేయడం జరిగింది. అందులో తెలంగాణ నుంచి జీవనోపాధి కోసం ముంబై, భివండి, నవీముంబై, సూరత్ తదితర ప్రాంతాలకు వలసవెళ్లిన వారున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో తాము క్రియాశీల పాత్ర వహించిన చరిత్ర ఉందని అందులో పేర్కొన్నారు. ఐతే తమను కె.కె కమిటి ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకొని ధృవీకరణ ప్రక్రియలో ఉంచాలి, ముంబై, భివండి, నవీముంబై, సూరత్ ఉద్యమకారులకు ఆధారాలు సమర్పించేందుకు ఆన్ లైన్ / ఆఫ్ లైన్ ప్రత్యేక అవకాశం కల్పించాలి. తమకు ప్రభుత్వ గుర్తింపు, సంక్షేమ పథకాల పంపిణీలో సముచితమైన అవకాశాలు కల్పించాలి.

# గణేశుడి ఆవిర్భావ చారిత్రక పరిణామం






సింధు నాగరికత కాలం నాటి ముద్రలపై కనిపించే ఏనుగు బొమ్మలు ..., మన దేశంలో గణేశుడు గుర్తు ఎంత పాతదో తెలియజేస్తాయి. అయితే ఆనాటి ఏనుగు చిత్రాలనే నేరుగా గణేశుడిగా భావించడానికి ఎలాంటి రాతపూర్వక ఆధారాలు లేవు. కాబట్టి ప్రాచీనమైన ఏనుగు బొమ్మలన్నీ గణేశుడి రూపాలే అనుకోవడం చారిత్రకంగా సరైనది కాదు. బౌద్ధ జాతక కథల్లో ఏనుగుకు విశిష్టమైన స్థానం ఉంది. ఛద్దంత జాతకంలో ఆరు దంతాల ఏనుగుల రాజుగా, మాతుపోషక జాతకంలో దృష్టి లేని తల్లిని ప్రేమగా చూసుకునే శ్రేష్ఠమైన ఏనుగుగా, నాళాగిరి వృత్తాంతంలో బుద్ధుని కరుణతో శాంతించిన మదగజంగా ఏనుగు కనిపిస్తుంది. ఇవన్నీ బుద్ధుని పూర్వ జన్మలకు సంబంధించిన రూపాలు మాత్రమే తప్ప గణేశుడికి సంబంధించినవి కావు. అవి త్యాగానికి, అమ్మపై ప్రేమకు, శాంతానికి సంకేతాలుగా నిలిచాయి. ఈ జాతక కథల మూలాలు చాలా ప్రాచీనమైనవి అయినప్పటికీ, నేడు మనకు అందుబాటులో ఉన్న గ్రంథాలు, తాళపత్రాలు వేర్వేరు కాలాలకు చెందినవనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

మథుర, అమరావతి, శ్రీలంక వంటి ప్రాంతాల్లో లభించిన సుమారు రెండు వేల ఏళ్ల నాటి శిల్పాల్లో ఏనుగు తల ఉన్న రూపాలు కనిపించినప్పటికీ, వాటి వద్ద వినాయకుడని స్పష్టంగా పేర్కొనే శాసనాలు లేకపోవడంతో వాటిని నేరుగా గణేశుడిగా నిరూపించలేం. మనం ప్రస్తుతం పూజిస్తున్న ఏనుగు ముఖం, తొండం, ఒకే దంతం ఉన్న గణేశుడి స్వరూపం సా.శ. నాలో, ఐదో శతాబ్దం నాటి గుప్తుల కాలం నుండి స్పష్టంగా రూపుదిద్దుకుంది. ఆ తర్వాత వచ్చిన మహాయాన, మంత్రయాన బౌద్ధ గ్రంథాల్లో వినాయకుడు అనే పేరు కనిపించినా, అది నేటి పూజనీయ దేవుడి రూపం కాదు. ఏడో శతాబ్దం నాటి వైరోచనాభిసంబోధి సూత్రం వంటి గ్రంథాల్లో వినాయకులు అంటే ఆధ్యాత్మిక సాధనకు, పూజలకు అడ్డంకులు కలిగించే శక్తులుగా లేదా అజ్ఞానానికి ప్రతీకలుగా వర్ణించారు.

అలాగే మంజుశ్రీమూలకల్పం అనే మంత్రయాన గ్రంథంలో ఏనుగు ముఖం, ఒకే దంతం కలిగిన 'వినాయకీ' అనే శక్తులు కనిపిస్తాయి. వజ్రయాన బౌద్ధంలో వినాయకుడి పాత్ర రెండు రకాలుగా రూపాంతరం చెందింది. ఒకవైపు సాధనకు విఘ్నం కలిగించే శక్తిగా భావిస్తూ అపరాజిత, విఘ్నాంతకుడు, మహాకాళుడు వంటి ఉగ్రరూపాలు ఏనుగు తల ఉన్న వినాయకుడిని కాళ్ల కింద తొక్కుతున్నట్లు శిల్పాల్లో మలచగా, మరొకవైపు గణపతి హృదయ, వినాయక హృదయ వంటి మంత్ర గ్రంథాల ద్వారా ధనాన్ని, రక్షణను ప్రసాదించే దేవుడిగా పూజించారు. ఆ తర్వాత కాలంలో పురాణ కథల ద్వారా గణేశుడు శివపార్వతుల పుత్రుడిగా, విఘ్న నివారకుడిగా, గణాలకు అధిపతిగా హిందూ సంప్రదాయంలో స్థిరపడ్డాడు. ఎలుక వాహనం, ఆయుధాలు, పూజా విధానాలు క్రమంగా రూపుదిద్దుకున్నాయి.

గణేశ పూజకు ప్రాచీనమైన చరిత్ర ఉన్నప్పటికీ, మనం ప్రస్తుతం వీధుల్లో ఘనంగా నిర్వహించే ఉత్సవాలకు వేరే నేపథ్యం ఉంది. 1893లో బాల గంగాధర్ తిలక్ ప్రజలను ఐక్యం చేయడానికి ఈ ఉత్సవాలను ఒక పెద్ద ప్రజా ఉద్యమంగా మలిచారు. అయితే ఆయన కంటే ముందే కొన్ని ప్రాంతాల్లో ఈ వేడుకలు ప్రాచుర్యంలో ఉండేవి. నేడు ఈ వేడుకల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగులు, థర్మోకోల్ వాడకం పెరిగిపోవడంతో నిమజ్జనం తీవ్ర జల కాలుష్యానికి దారితీసి, నీటి జీవుల మనుగడకు ప్రమాదకరంగా మారిందని కాలుష్య నివారణ మండలి కూడా స్పష్టం చేసింది.

మొత్తంగా పరిశీలిస్తే, మొదట జాతక కథల్లో బుద్ధుని పూర్వజన్మగా కనిపించిన ఏనుగు గుర్తు, తర్వాత బౌద్ధ తంత్రంలో అడ్డంకిగా, రక్షకుడిగా, సంపదను ఇచ్చే దేవతగా మారి, ఆ తర్వాతే హిందూ సంప్రదాయంలో విఘ్నేశ్వరుడిగా స్థిరపడింది. వేల ఏళ్ల నాటి ప్రతీ ఏనుగు రూపాన్ని నేటి గణేశుడితో ముడిపెట్టకుండా శిల్పాలు, గ్రంథాలు, కాలక్రమాన్ని ఆధారంగా చేసుకుని చరిత్రను సమగ్రంగా అర్థం చేసుకోవడం అవసరం.

**- వివరం**

# పారా హుషార్.. ఎవరు దేశద్రోహులు?



'ప్రజలందరూ సమానం' అనే సమానత్వ హక్కును ఇచ్చిన రాజ్యాంగాన్ని విస్మరించే వాళ్ళు; సామాజిక, ఆర్థిక అసమానతలను పెంచే మనుధర్మాన్ని అమలు చేస్తామని బహిరంగంగా ప్రకటించే వాళ్ళు; ప్రభుత్వరంగ సంస్థలను, ప్రకృతి వనరులను, ఈ దేశ సంపదను కార్పొరేట్ దొంగలకు కట్టబెట్టే వాళ్ళు; మతాలు, దేవుళ్ళు, సంస్కృతి సంప్రదాయాల పేరుతో, ప్రజల్లో ప్రశ్నించే చైతన్యాన్ని నీరు కార్చేవాళ్ళు; ప్రజల్లో అశాస్త్రీయ భావాలను, మతమౌఢ్యాన్ని పెంపొందించే వాళ్ళు; ప్రజాస్వామ్యం ముసుగులో రాజ్యాంగాన్ని, ఎన్నికల వ్యవస్థను ఖూనీ చేసేవాళ్ళు; అడ్డదారుల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి.. డబ్బులు , మద్యం, విలువైన కానుకలను ఓటర్లకు పంచిపెడుతూ.. ఓట్ల కోసం కోట్ల రూపాయలను ఖర్చు పెట్టే వాళ్ళు; అధికారం దక్కగానే అందిన కాడికి దోచుకుతినే వాళ్ళు.. అంతిమంగా వీళ్ళు దేశద్రోహులే అవుతారు!

వీరి అప్రజాస్వామిక పాలనను ప్రశ్నించిన వారిని, జైళ్ళపాలు చేస్తూ.. భారతదేశ యువతకు భవిష్యత్తు లేకుండా చేస్తున్న, ఈ పాలక దోపిడీ వర్గాలు దేశద్రోహులా? లేక 'వీరి ప్రజావ్యతిరేక విధానాలను, వీరి దుర్మార్గాన్ని ప్రశ్నించే' ప్రజలు, సామాజిక బుద్ధిజీవులు దేశద్రోహులా?

**- ముద్దగౌని సుభాష్**
**సామాజిక విప్లవ రచయిత**
**ఫోన్: 9000904284**

నిర్దేశం మన దిశా నిర్దేశం

# కట్టు బట్టలతో వలస వచ్చి..
# ఆపదలో ఉన్నోళ్లను ఆదుకునే స్థాయికి...



## మానవత్వమే సందిరి గోవర్ధన్ రెడ్డి చిరునామా

సక్సెస్ స్టోరీ

**డబ్బు అన్నిటినీ నిర్ణయిస్తున్న కాలంలో, ఆపదలో ఉన్నవారిని అన్నలా చూసే మనిషి సందిరి గోవర్ధన్ రెడ్డి. మానసిక వికలాంగులు కనిపిస్తే ఒక పూట భోజనం పెడతారు. ఆసుపత్రి బిల్లులు కట్టలేని వారు సహాయం అడిగితే ఖాళీ చేతులతో పంపరు. ఇవన్నీ చేస్తున్నారని ఆయన పుట్టుకతో ధనవంతులు కాదు. కష్టమే ఫలిస్తుందని నమ్మి, బ్రతుకు తెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి రాతింబవళ్లు పనిచేసిన వ్యక్తి.**



### బాల్యం

గోవర్ధన్ రెడ్డి 1967 ఆగస్టు 25న మెదక్ జిల్లా తూప్రాన్ మండలం పీ.టీ. వెంకటాపూర్‌లో సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. తల్లి సందిరి అనసూయమ్మ కష్టాన్ని ఇష్టంగా స్వీకరించిన మహిళ.తండ్రి సందిరి తిరుపతి రెడ్డి గ్రామ అధికారిగా నిజాయితీతో పనిచేశారు. ఐదు గురు అన్నదమ్ములు, ఒక చెల్లెలు. గోవర్ధన్ రెడ్డి మూడో వారు. "నా తల్లిదండ్రులే నా దేవుళ్లు. నా అన్నదమ్ములే నా బలం"అని ఆయన తరచు చెబుతారు. కుటుంబం ఆర్థికంగా కుదురుకున్న తర్వాత కూడా అందరినీ కలిపి ఉంచడమే ఆయన నడవడి.

### ఆరువందల రూపాయల జీతం నుంచి

సందిరి గోవర్ధన్ రెడ్డి బి.కామ్ వరకు చదివి, కుటుంబ పోషణ కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఒక మిల్క్ డైరీలో నెలకు రూ.600 జీతానికి సూపర్‌వైజర్‌గా చేరారు. సరిపోక రాత్రులు ఓవర్‌టైం చేశారు. కష్టం, నిజాయితీ చూసి యాజమాన్యం ఆయనను మేనేజర్‌గా ప్రమోట్ చేసింది. తర్వాత స్వగ్రామంలో రూ.2.40 లక్షలకు భూమి కొని వ్యవసాయం చేశారు. పంటలు నిలవనప్పుడు కూరగాయలు పండించి పిల్లల చదువు కొనసాగించారు. 2003 నాటికి సొంత ఇల్లు కట్టుకున్నారు.

### ఎం.ఎన్. రెడ్డి కాలనీకి అన్నలా

సందిరి గోవర్ధన్ రెడ్డి 2002 నుంచి రియల్ ఎస్టేట్ రంగంలో అడుగుపెట్టి సుచిత్ర ఎం.ఎన్. రెడ్డి నగర్‌లో స్థిరపడ్డారు. ఆ కాలనీలో సుమారు 25 ఏళ్లుగా అధ్యక్షుడిగా ఉన్నారు. సొలేరు విల్లాస్, కొంపల్లిలో కూడా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. రోడ్డు, డ్రైనేజీ, నీరు, కరెంటు సమస్య వస్తే అర్ధరాత్రైనా ముందు నిలబడతారు.

### ఎం.ఎన్. రెడ్డి కమ్యూనిటీ హాలు

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వినియోగించారు. నాలుగు వందల గజాల స్థలంలో కమిటీ ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌కు నిధులు సరిపోక తానే రూ.4.50 లక్షలు వేశారు. ఎమ్మెల్యే కె.పి. వివేకానంద, భరత్ సింహా రెడ్డి, స్నేహితుల సహకారంతో మొదటి అంతస్తు పూర్తి చేసి కాలనీకి అంకితం చేశారు. పేద కుటుంబాలు తక్కువ రుసుముతో శుభకార్యాలకు ఆ హాలును



సందిరి గోవర్ధన్ రెడ్డి తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ అనుచరుడిగా ప్రజలకు సేవ చేస్తారు. రాజకీయాన్ని పదవి కంటే సేవగా చూస్తారు. యోగా గురువు రవీందర్ రాజు వద్ద యోగా నేర్చుకుని అనేకమందికి ఉచితంగా నేర్పారు. ఒక శిష్యుడు ఇచ్చిన రూ.10 లక్షలను స్వార్థానికి వాడకుండా, ఆ దాత తల్లిదండ్రులు పొన్నల కిష్టమ్మ, వీరయ్య పేరిట ఎం.ఎన్. రెడ్డి వాడుకుంటున్నారు. అక్కడి ఆదాయాన్ని కాశీ విశ్వేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి మళ్లిస్తున్నారు.

### గోశాల, ఆలయం

వెంకటాపూర్‌లోని తన మామిడితోటలో సందిరి గోవర్ధన్ రెడ్డి గోశాల నిర్వహణకు ఐదేళ్లపాటు ఉచితంగా బోరు నీరు ఇచ్చారు. పూజారి కోరిక మేరకు స్థానిక కంపెనీ ద్వారా సుమారు రెండున్నర కోట్ల విలువైన స్థలం గోశాలకు దక్కేలా కృషి చేశారు. విగ్రహం లేని ఆలయాన్ని కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంగా తీర్చిదిద్దారు. గురుజీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గోశాల నడుస్తోంది. 'శ్రీకృష్ణ గోసేవ' గ్రూప్ ద్వారా సుమారు రూ.1.50 లక్షలతో ఫ్లోరింగ్ చేయించారు. ఎమ్మెల్యే వివేకానంద సహాయంతో కాంపౌండ్ గోడ వేశారు. అవసరమైనప్పుడు సొంత ఖర్చుతో పశుగ్రాసం పంపించారు. సందిరి గోవర్ధన్ రెడ్డి మాట సాధారణం: "ఇది నా గొప్ప కాదు. అవకాశం దొరికింది, చేశాను."

### ఎదుటివాడి బాధను ఇంటి బాధలా..

సందిరి గోవర్ధన్ రెడ్డి సుచిత్ర, కొంపల్లి, షాపూర్ రోడ్లపై మతిస్థిమితం లేని వారు కనిపిస్తే సాధ్యమైనంత సహాయం చేసి అనాథాశ్రమాలకు చేర్చేవారు. ఆసుపత్రిలో ఉన్న పేదలకు వైద్య ఖర్చులిచ్చేవారు. పెళ్లిళ్లకు, ఆకస్మిక బాధలకు చేయూతనిచ్చేవారు. ఇటీవల కాలనీలో ఒక యువకుడి తల శస్త్రచికిత్సకు విరాళాలు సేకరించి రూ.50 వేలు అందించారు. ఇవి ప్రకటనలు కావు. ఎదుటివాడి బాధను తన ఇంటి బాధలా చూసే అలవాటు.


### కుటుంబం


సందిరి గోవర్ధన్ రెడ్డికి ఇద్దరు కుమారులు. కోడళ్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. తండ్రి బాటలోనే సేవలో పాలుపంచుకుంటున్నారు. కులం, మతం చూసి మాట్లాడని వ్యక్తి. కలిసిన ప్రతి ఒక్కరినీ అన్నా, తమ్ముడా, అక్కా, చెల్లీ అని పలకరిస్తారు. "బాగుండాలి. మంచి చేయాలి. మంచిగా ఉండాలి" ఇది నినాదం కాదు, రోజువారీ నడవడి.

ఆరువందల రూపాయల జీతం నుంచి ఎదిగిన సందిరి గోవర్ధన్ రెడ్డి, ఎదిగిన తర్వాత కూడా రోడ్డుపై ఉన్న మనిషిని చూసి ఆగగలిగితే అది విజయం కాదు. మానవత్వం. సంపద ఉండడం తప్పు కాదు. సంపద ఉన్నా మానవత్వాన్ని మరచిపోవడం తప్పు. ఇలాంటి వారిని నడవడిని చూసి, సాధ్యమైనంత మేరకు మనం కూడా ఒక అడుగు ముందుకు వేస్తే చాలు. ఆపదలో ఉన్న వారికి చేయి అందించడమే ఈ కథ చెప్పే పాఠం.

**- వయ్యామ్మెస్ ఉదయశ్రీ**





# బంగారం సృష్టించిన నగరం!

## భూమి కింద బయటపడిన అపారమైన బంగారం..
## భూమి పైన జోహన్నెస్ బర్గ్‌ను ఎలా పుట్టించింది?



(రమణ కొంటికర్ల)

ఒక బంగారు గని... ఓ నగరాన్ని, ఓ దేశాన్ని, ప్రపంచ రాజకీయ ఆర్థిక చరిత్రను ఎలా మార్చింది..? ఈ విశేషాలు తెలుసుకోవాలంటే మనమోసారి దక్షిణాఫ్రికా దాకా వెళ్లొద్దాం.

ఒకనాడక్కడ నగరం లేదు, భవనాల్లేవు, రద్దీ రోడ్లూ లేవు, ప్రపంచస్థాయి కంపెనీలూ లేవు... ఉన్నది కేవలం విస్తారమైన భూభాగం మాత్రమే. కానీ, ఆ నేల కింద బంగారముందనే విషయం తెలిసింది. అంతే! కొన్నేళ్ళల్లో ప్రపంచం నలుమూలల నుంచీ జనం అక్కడ వాలిపోయారు. గనులు పుట్టుకొచ్చాయి. రైల్వేలు వచ్చాయి. డబ్బు ప్రవాహం మొదలైంది. ఓ కొత్త నగరం రూపుదిద్దుకుంది. ఇదే జోహన్నెస్ బర్గ్ చరిత్ర.

గోల్డ్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్! జోహన్నెస్ బర్గ్‌కున్న గుర్తింపిది. ఈగోలి అంటారు. అంటే స్థానికంగా జులు భాషలో బంగారముండే ప్రాంతం.

### 1886... జోహన్నెస్ బర్గ్ చరిత్రను మార్చిన ఏడాది!

విట్ వాటర్స్ రాండ్ ప్రాంతంలో బంగారం నిల్వలున్నట్టు 1884లోనే కొన్ని ఆధారాలు బయటపడ్డాయి. కానీ, ప్రపంచ చరిత్రను మార్చిన గోల్డ్ రీఫ్ 1886లో లాంగ్ లాగ్టే అనే ప్రాంతంలో గుర్తించారు. జార్జ్ హారిసన్ అక్కడ బంగారం కలిగిన రీఫ్‌ను గుర్తించడంతో ఈ ప్రాంతంలోని అపారమైన బంగారు సంపద ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

1886 సెప్టెంబర్ 8న విట్ వాటర్స్ రాండ్‌లోని తొమ్మిది ఫార్మ్ లను అధికారికంగా బంగారం తవ్వకాల కోసం అనుమతించారు. అప్పటికే జనం వెల్లువలా రావడం మొదలైంది. బంగారం నిల్వల కోసం ప్రపంచమంతా అటే పరుగెడుతోంది. నెలల్లోపే వేల సంఖ్యలో వలస వచ్చినవారితో జోహన్నెస్ బర్గ్ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. పదేళ్లు గడిచేలోపు జోహెన్నెసర్ బర్గ్ జనాభా ఆరోజుల్లోనే లక్ష దాటేసింది. ఆ జనాభాలో గణనీయమైన వాటా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలసదారులదే.

### ఓ నగరాన్ని సృష్టించిన బంగారం!

సాధారణంగా ఏ పట్టణమైనా, నగరమైనా, ప్రాంతమైనా వాటి నాగరికత నదులు, సముద్రాల వెంట చూస్తుంటాం. కానీ, జోహన్నెస్ బర్గ్ ది ఇందుకు భిన్నమైన కథ. బంగారు గనుల పునాదులపై వెలసిన నగరమిది. గనులు పెరుగుతున్నకొద్దీ కార్మికులు పెరిగారు. యంత్రాలు పెరిగాయి. రైల్వే కనెక్టివిటీ పెరిగి పెద్దదైంది. బ్యాంకులు వెలిసాయి. ఇలా ఒక బంగారు గనులున్న ప్రాంతం... ఏకంగా ఓ పారిశ్రామిక నగరంగా రూపుదిద్దుకుంది.

విట్ వాటర్స్ రాండ్ బంగారు ప్రాంతం.. ఆధునిక దక్షిణాఫ్రికా పారిశ్రామిక ప్రాంతంగా ఏర్పడటానికి కీలకమైన మలుపుగా మారిందని దక్షిణాఫ్రికా ప్రభుత్వ చరిత్ర పత్రాలే పేర్కొంటున్నాయి.

### కనిపించేది మాత్రమే బంగారం కాదు.. నేల లోపలే అసలైన సవాళ్లు!

ఇక్కడి బంగారం కథలో ఆసక్తికరమైన విషయాలు కనిపిస్తాయి. బంగారం పైపైనే లభించేది కాదు. గనుల్లో లోతుకు వెళ్లేకొద్దీ దాన్ని వెలికి తీయడం మరింత కష్టంగా మారింది. పెద్ద మొత్తంలో పెట్టుబడులు, ఇంజనీరింగ్ నైపుణ్యం, నూతన సాంకేతికత అవసరమయ్యాయి.

1887లో అభివృద్ధి చెందిన మ్యాక్ ఆర్థర్ – ఫారెస్ట్ సైనైడ్ అనే ప్రక్రియ ద్వారా తక్కువ నాణ్యత కల్గిన ధాతువు నుంచి కూడా బంగారాన్ని సమర్థవంతంగా వెలికి తీయడం సాధ్యమైంది. 1890లో ఈ విధానం ర్యాండ్ ప్రాంతంలో ఉపయోగించడంతో ఈ గనుల్లో ఇక పెద్ద ఎత్తున పెట్టుబడులు వెల్లువెత్తాయి. అంటే, బంగారు గనులుంటే... వాటిని వెలికి తీసేందుకు మనిషి కనుక్కున్న సాంకేతికత, పెట్టిన పెట్టుబడులు, మానవ శ్రమ వెరసి.. మొత్తంగా జోహన్నెస్ బర్గ్‌ను ప్రపంచస్థాయి నగరంగా మార్చింది.

### సంపదనే కాదు.. రాజకీయాలనూ శాసించిన బంగారం కథ!

ఇక్కడ వెలికితీసిన బంగారం ట్రాన్స్ వాల్ అనే ప్రాంతాన్ని ఒక్కసారిగా అత్యంత విలువైన ప్రాంతంగా మార్చేసింది. విదేశీ పెట్టుబడిదారులు, కార్మికులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు ఇలా అంతా ఇక్కడి చేరుకున్నారు. బ్రిటన్– బోయెర్ రిపబ్లిక్ మధ్య ఉద్రిక్తతలకూ ఈ బంగారు గనుల సంపంద ఓ ముఖ్య కారణంగా మారింది. చివరకు ఈ పరిణామాలు ఆంగ్లో – బోయెర్ వార్‌కు దిశగా తీసుకెళ్లాయి. బంగారం ఓ ప్రాంత చరిత్రనే లిఖించింది. ఆర్థిక వ్యవస్థనే మార్చేసింది. నగరాన్నే సృష్టించింది. వలసలను పెంచింది. రాజకీయ పోరాటాలను తీవ్రం చేసింది. చివరకు దక్షిణాఫ్రికా భవిష్యత్తునే ప్రభావితం చేసింది.

### ప్రపంచ బంగారంలో ఎంత వాటా..?

విట్ వాటర్స్ రాండ్ బంగారు క్షేత్రాలు ప్రపంచ చరిత్రలోనే అత్యంత సుసంపన్నమైన బంగారు గనుల్లో ఒకటిగా నిల్చాయి. కొన్ని అంచనాల ప్రకారం 1886 నుంచి ప్రపంచంలో ఇప్పటివరకూ తవ్విన మొత్తం బంగారంలో.. ఈ ప్రాంతం నుంచి వెలికి తీసిన నిల్వలే 40 శాతమట. ఈ సంఖ్యను జోహన్నెస్ బర్గ్ నగరం ఒక్కటే ఉత్పత్తి చేసిందని కాదు.. కానీ, విస్తృతమైన విట్ వాటర్స్ రాండ్ గోల్డ్ ఫీల్డ్ ప్రాంతానికి సంబంధించిన అపారమైన సంపదగా మాత్రం చెప్పుకోవచ్చు.

### అందుకే బంగారు నగరంగా గుర్తింపు!


జోహన్నెస్ బర్గ్‌ను చూస్తే ఇప్పుడు ఆకాశహర్మ్యాలు, ఆర్థిక సంస్థలు, ప్రపంచస్థాయి వ్యాపార కేంద్రాలు కనిపిస్తాయి. ఈ నగరం రూపకల్పనకు పునాది మాత్రం భూఅంతరాల్లోని బంగారు నిల్వలు వేశాయి.

1886లో వెలుగులోకొచ్చిన బంగారు సంపద ఓ చిన్న మైనింగ్ సెటిల్మెంట్‌తో జోహన్నెస్ బర్గ్ రూపురేఖలు, చరిత్రే మారిపోయింది. ఖనిజ సంపద ఓ నగరాన్ని ఎలా పుట్టించిందో.. ఓ ప్రాంతపు ఆర్థిక వ్యవస్థను ఎలా మార్చగలదో... ఓ గని ప్రపంచ రాజకీయాలను ఎలా ప్రభావితం చేయగలదో చెప్పే కథ జోహన్నెస్ బర్గ్ ది. అలా భూమి కింద దాగి ఉన్న బంగారం వెలుగులోకి వచ్చిన తర్వాత ఒక్క జోహన్నెస్‌బర్గ్ రూపురేఖలే మారలేదు.. దక్షిణాఫ్రికా ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక అభివృద్ధి, రాజకీయ చరిత్ర కూడా కొత్త మలుపు తిరిగాయి

**- బాతాఖానీ డాట్ ఇన్ సౌజన్యంతో..**

## కవిత్వం

### తల్లి - దేవత ఇద్దరిలో ఎవరు గొప్ప..?



మనిషికి జన్మనిచ్చిన తల్లి గొప్పదా..
లేక మనిషి చేతులతో తయారైన
దేవుడు గొప్పవాడా..?

గుడిలో రాతి విగ్రహానికి
పూలు, పాలు, నైవేద్యం పెడతాం.
వేల రూపాయలు హుండీలో వేస్తాం.
పది రోజులు భజనలు చేసి
పదకొండో రోజు అదే దేవుడిని నీళ్లలో
ముంచేస్తాం.

గుడి గడప దాటగానే
ఆకలితో నిలబడిన మనిషిని
వెనక్కి తిరిగి చూడం.

విగ్రహానికి చిన్న మచ్చ పడినా
బాధపడతాం.
మనిషి మనసును మాటలతో
గాయపరిచినా
అది తప్పుగా కూడా అనిపించదు.

దేవుడి ముందు
"అందరూ సుఖంగా ఉండాలి"
అని ప్రార్థిస్తాం.
పక్కనున్న మనిషి కష్టంలో ఉంటే
"నాకెందుకు?" అని నిశ్శబ్దంగా
వెళ్లిపోతాం.

నోటిలో భక్తి ఉంటుంది.
చేతుల్లో మానవత్వం ఉండదు.

గుడి ముందు తల వంచుతాం.
మనిషి ముందు అహంకారం వంచలేం.

రాయిలో దేవుణ్ణి చూసే కళ్లకు
రక్తమాంసాల మనిషిలో దేవుడు
కనిపించడు.

గుడిలోకి వెళ్లే ముందు
మనిషిగా మారడం నేర్చుకోవాలి.

దేవుడు గుడిలో ఉన్నాడో లేదో
తెలియకపోవచ్చు.
కానీ మనిషి రూపంలో
ప్రతిరోజూ మన ముందున్నాడు.

గుడిలో దేవుణ్ణి చూడటం భక్తి కావచ్చు.
మనిషిలో మనిషిని చూడటం మానవత్వం.

మానవత్వం లేని భక్తి
దేవుడికైనా అవసరం లేదు.

**- శ్రావణ్ కుమార్, కవి, నిజామాబాద్**

### నేను కనబడుట లేదు



నిజమే
అబద్ధం కాదు
నా నుండి నేను
ఎటో పారిపోయాను

నేను కనబడుట లేదు
అంటూ ప్రకటించి
చాలా రోజులే అయ్యింది
ఇంత వరకు నన్నెవరూ
చూడలేదు
నాకు కూడా
నేను కనపడలేదు

నేను కావలసిన వాళ్ళు కూడా
నన్ను వెతుకుతున్నారు

ఎక్కడైనా నా నిట్టూర్పు వినపడినా
నేను నాకు దొరికిపోతాను
ఇతరులకూ కనపడుతాను
చిరునామా కోల్పోవటం కంటే
విషాద కాలం ఏముంటుంది

ఇప్పుడు నేను
తెగిన గాలిపటాన్నై
ఏ కొమ్మల్లో చిక్కుకు పోయానో
నన్నెవరైనా నన్ను నాకోసం
వెతికి పెట్టగలరా

**- పర్కపెల్లి యాదగిరి, కవి**









# ట్రెడిషనల్ స్టైలిష్ లుక్‌లో కీర్తి సురేష్



# హారర్ థ్రిల్లర్ '418' విడుదల వాయిదా..




టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ సమర్పణలో, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న సరికొత్త ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ '418'. ఈ సినిమాతో కీర్తన నాగగౌడ్ దర్శకురాలిగా టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికేట్ లభించింది. మొదట ఈ సినిమాను సెప్టెంబర్ 18న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే సినిమా విడుదలకు కేవలం మూడు రోజులు మాత్రమే సమయం ఉందనగా, చిత్రబృందం తాజాగా ఈ మూవీ రిలీజ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. సినిమా విడుదల వాయిదా పడటానికి ప్రధాన కారణాలను మేకర్స్ వివరిస్తూ.. ఈ చిత్రానికి విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించిందని తెలిపారు. దీనివల్ల సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి.

అంతేకాకుండా, ఎంపిక చేసిన ప్రేక్షకులు, సినీ పరిశ్రమ ప్రముఖుల కోసం నిర్వహించిన స్పెషల్ ప్రీమియర్ షోల నుంచి కూడా చిత్ర యూనిట్‌కు ఎంతో ప్రోత్సాహకరమైన రివ్యూలు వచ్చాయని అన్నారు. ఈ చిత్రాన్ని చూసిన ఇతర భాషా మార్కెట్ల ప్రదర్శకులు సైతం చాలా పాజిటివ్‌గా స్పందించారని తెలిపారు. ఈ సినిమాను కేవలం తెలుగులోనే కాకుండా, ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. దక్షిణాది భాషలతో పాటు హిందీలో కూడా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు ఉన్న మంచి అవకాశాలను నిర్మాతలు పరిశీలిస్తున్నారట. ఎక్కువ మంది థియేటర్లలో ఈ హారర్ చిత్రాన్ని చూసేందుకు వీలుగా, అన్ని భాషల్లో కలిపి ఒకేసారి విడుదల చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అందువల్ల, గతంలో అనుకున్నట్లుగా సెప్టెంబర్ 18న '418' సినిమా విడుదల కావడం లేదని స్పష్టం చేశారు. ఈ సినిమాకు సంబంధించిన కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

# నవ్వులు పూయిస్తున్న 'అనుమాన పక్షి' ట్రైలర్

### రాగ్ మయూర్ మార్క్ విలక్షణ నటన..

### కామెడీ, క్రైమ్, డ్రామా కలగలిపిన కథలా 'అనుమాన పక్షి'




టాలీవుడ్‌లో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటుడు రాగ్ మయూర్ మరో ఆసక్తికరమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'అనుమాన పక్షి' సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ట్రైలర్ ఆద్యంతం కామెడీతో ఆకట్టుకునేలా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. సీరియస్‌గా కనిపించే క్రైమ్ అంశాన్ని కామెడీ, డ్రామాతో ముడిపెట్టి దర్శకుడు కథను తెరకెక్కించినట్లు ట్రైలర్‌ను చూస్తే అర్థమవుతోంది.

'డీజే టిల్లు' సినిమాకు దర్శకత్వం వహించిన దర్శకుడి నుంచి వస్తున్న ఈ చిత్రం కావడంతో ప్రారంభం నుంచే మంచి అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌లో రాగ్ మయూర్ తనదైన శైలిలో నటిస్తూ నవ్వులు పూయించాడు. అమాయకత్వం, అయోమయం, అనుమానం కలగలిసిన పాత్రలో ఆయన నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సన్నివేశాల్లో టైమింగ్, హావభావాలతో రాగ్ మయూర్ మరోసారి తన విలక్షణ నటనను చూపించాడు.

సినిమాలో రాశీ, అజయ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలను బట్టి కథలో కామెడీతో పాటు క్రైమ్, డ్రామా అంశాలకు కూడా ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. ఓ అనుమానాస్పద పరిస్థితి చుట్టూ కథ సాగుతూ, దాని నుంచి పుట్టే పరిణామాలు ప్రేక్షకులను నవ్వించేలా ఉన్నాయని ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. పాత్రల మధ్య జరిగే సంభాషణలు, ఆసక్తికరమైన సన్నివేశాలు సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి.

మొత్తంగా చూస్తే 'అనుమాన పక్షి' ట్రైలర్ కామెడీ ప్రధానంగా సాగుతూనే క్రైమ్, డ్రామా అంశాలను కూడా టచ్ చేసినట్లు కనిపిస్తోంది. రాగ్ మయూర్ నటన, వినోదాత్మక సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా మారే అవకాశం ఉంది. ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. సినిమా విడుదల తర్వాత ఈ విభిన్నమైన కథ ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.

# రొమాంటిక్ రిలేషన్‌షిప్ లేదు

### ఆనంద్ దేవరకొండతో పెళ్లిపై స్పందించి క్లారిటీ ఇచ్చిన వైష్ణవి చైతన్య



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ వైష్ణవి చైతన్య వ్యక్తిగత జీవితం గురించి సోషల్ మీడియాలో గత కొంతకాలంగా రకరకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా యంగ్ హీరో ఆనంద్ దేవరకొండతో ఆమె ప్రేమలో ఉందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ కలిసి బ్లాక్‌బస్టర్ హిట్ 'బేబి'తో పాటు 'ఎపిక్'లో జోడీ కట్టడంతో ఆ ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీని చూసి నిజ జీవితంలోనూ వీరు ప్రేమలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. అంతేకాకుండా రాబోయే రోజుల్లో వీరిద్దరూ పెళ్లి పీటలెక్కి కొత్త జీవితాన్ని పంచుకోబోతున్నారంటూ జోరుగా చర్చలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న డేటింగ్, పెళ్లి రూమర్లపై వైష్ణవి చైతన్య తాజాగా స్పందించి క్లారిటీ ఇచ్చారు. ఓ ఇంటర్వ్యూలో భాగంగా అసలు నిజం బయటపెట్టారు. తమ ఇద్దరి మధ్య ఎలాంటి రొమాంటిక్ రిలేషన్‌షిప్ లేదని ఆమె స్పష్టం చేశారు. తామిద్దరం కేవలం మంచి కోస్టార్స్ మాత్రమే కాకుండా మంచి స్నేహితులు అని తెలిపారు. ఇండస్ట్రీలో తమ ప్రయాణం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు తమ మధ్య ఒక మంచి స్నేహబంధం, ట్రావెల్ ఉందని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో ఆనంద్ దేవరకొండ పెళ్లి గురించి వస్తున్న చర్చలపై కూడా ఆమె స్పందించారు. రాబోయే మూడు సంవత్సరాలలో పెళ్లి చేసుకునే ఆలోచనలో ఆనంద్ ఉన్నాడని ఆమె పేర్కొన్నారు. కానీ, తనకు మాత్రం పెళ్లి గురించి ఆలోచించడానికి ఇంకా చాలా సమయం ఉందని, ప్రస్తుతానికి తన పూర్తి దృష్టి కేవలం సినిమాలపైనే ఉందని ఆమె స్పష్టం చేశారు. ఈ విధంగా వైష్ణవి చైతన్య తనపై వస్తున్న ప్రచారానికి పూర్తిగా చెక్ పెట్టడంతో పాటు, తమ మధ్య కేవలం స్నేహం మాత్రమే ఉందని చెప్పారు.

# 'డేవిడ్ రెడ్డి' నుంచి పవర్ ఫుల్ పోస్టర్ విడుదల




మంచు మనోజ్ హీరోగా, హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పవర్ ప్యాక్డ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి'. బ్రిటిష్ పరిపాలనా కాలం నాటి నేపథ్యంలో, మన దేశ స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన ఒక సాహసోపేతమైన విప్లవాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ఈ సినిమాలో రష్యన్ బ్యూటీ, 'ప్రిన్స్' ఫేమ్ మరియా రియాబోషాప్కా నటిస్తుండగా, ఆంగ్లేయుల అన్యాయాలను ఎదిరించి పోరాడే యోధుడిగా మంచు మనోజ్ కనిపించనున్నారు. ఈ సినిమాలో సీనియర్ స్టార్ హీరోయిన్ రమ్యకృష్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. నేడు ఆమె పుట్టినరోజు కావడంతో, మేకర్స్ ఆమె పాత్రకు సంబంధించిన ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. 'బాహుబలి' చిత్రంలో శివగామి పాత్ర ఎంతటి పేరు తెచ్చిపెట్టిందో, ఈ చిత్రంలో ఆమె అంతకు మించిన ఉగ్రరూపంలో 'కమలారెడ్డి'గా అలరించనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.

ఇక విడుదలైన పోస్టర్‌లో ఒక కుర్చీపై తీవ్రమైన కోపంతో కూర్చుని, చేతిలో పెద్ద కత్తి పట్టుకుని ఉన్న రమ్యకృష్ణ లుక్ అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆమె పాదాల కింద శవాలు, చుట్టూ రక్తపు మడుగుతో ఉన్న ఈ విజువల్స్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. 'ఆమెకు యుద్ధభూమి అంటే భయం లేదు.. యుద్ధభూమియే ఆమెకు భయపడుతుంది' అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ భారీ చిత్రంలో సముద్రఖని, బాలీవుడ్ ప్రముఖ నటుడు అభయ్ డియోల్ కీలక పాత్రలలో నటిస్తున్నారు. వెల్‌వెట్ సౌండ్, ట్రూ రెడిక్స్ బ్యానర్లపై అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు చిత్రబృందం. మంచు మనోజ్ మాస్ యాక్షన్, రమ్యకృష్ణ ఉగ్రరూపం కలగలిసి రాబోతున్న ఈ పీరియాడిక్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# జస్ట్, సెక్యూరిటీ కాదు

## రాష్ట్రపతి పక్కన నడక అంత ఈజీ కాదు!





(ఎం.ఎస్.ఆర్.)

రాష్ట్రపతి పక్కన ఎప్పుడూ తప్పకుండా కనిపించే ఒక అధికారి అసలు ఉద్యోగం కేవలం రక్షణేనా? కాదు, వివరంగా చెప్పుకుందాం ఓసారి...

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్కడికి వెళ్లినా ఆమె వెంటే కనిపించే ఒక యువ ఆర్మీ అధికారి సోషల్ మీడియాలో చాలామందికి సుపరిచితమే. యూనిఫామ్‌లో హుందాగా కనిపించే మేజర్ రిషభ్ సింగ్ సంబ్యాల్‌కు కొంతకాలానికే 'నేషనల్ క్రష్' అనే ట్యాగ్ కూడా వచ్చేసింది. కానీ కెమెరాలో కనిపించే ఆ కొన్ని సెకన్ల వెనుక ఉన్న జీవితం మాత్రం అంత అందంగా ఏమీ లేదు.

12 ఏళ్ల సైనిక జీవితానికి, అందులో మూడేళ్లపాటు రాష్ట్రపతికి ఎయిడ్-డి-కాంప్‌గా పనిచేసిన తర్వాత 30 ఏళ్లకే రిషభ్ ఆర్మీ నుంచి ముందస్తు రిటైర్మెంట్ తీసుకున్నాడు. "ఇది నా జీవితంలోనే అత్యంత కఠినమైన నిర్ణయం" అని చెప్పిన ఆయన.. కుటుంబ బాధ్యతలే కారణమని వెల్లడించాడు. ఈ నిర్ణయం ఒక్కరోజులో తీసుకున్నది కాదు. దాదాపు నాలుగు నెలల పాటు ఆలోచించిన తర్వాతే యూనిఫామ్‌కు వీడ్కోలు పలికాడు.

కానీ అసలు ఆసక్తికరమైన విషయం రిషభ్ ఎందుకు ఆర్మీ వదిలారన్నదానికంటే... రాష్ట్రపతికి ఏడీసీ గా ఉండటం అంటే అసలు ఏమిటన్నదే!

అసలు ఏడీసీ కావాలనుకోలేదట! విచిత్రం ఏమిటంటే.. రిషభ్ అసలు ఏడీసీ కావాలని కోరుకోలేదట. మరో దేశానికి చెందిన సైనికులతో ఇండియాలో జరుగుతున్న ఓ ఎక్సర్‌సైజ్‌లో ఉన్నప్పుడు ఆయన సీవో నుంచి ఫోన్ వచ్చింది. "నువ్వు ఏడీసీ పోస్టుకు షార్ట్‌లిస్ట్ అయ్యావు.. ఏం చేయాలనుకుంటున్నావు?" అని అడిగారట.

రిషభ్ సమాధానం కూడా ఆసక్తికరమే. "ఇక్కడికి వెళ్తాను.. అక్కడికి వెళ్తాను.. కానీ అక్కడికి మాత్రం వెళ్లను" అన్నాడట. చివరికి తన సీనియర్ల సలహాతో ఒకసారి ప్రయత్నిద్దామని అనుకున్నాడట. అయితే జూ మాత్రం "ట్రై చేయడం అంటూ ఏమీ లేదు. వెళ్తే వెళ్లాలి.. లేకపోతే లేదు. ఫెయిల్ అయితే నీకు చాలా కష్టం" అని తేల్చిచెప్పాడట.

అలా మొదలైన ప్రయాణమే చివరికి ఆయనను దేశ ప్రథమ పౌరురాలి చుట్టూ అత్యంత సన్నిహితంగా మెసిలే అధికారుల్లో ఒకరిగా నిలబెట్టింది.

రాష్ట్రపతి పక్కన నడవడం అంత ఈజీ కాదు! బయట నుంచి చూస్తే ఏడీసీ అంటే రాష్ట్రపతి వెనుక రెండు అడుగుల దూరంలో నడుస్తూ కనిపించే ఓ ఆర్మీ అధికారి అనిపిస్తుంది. కానీ వాస్తవానికి ఆయన పని అంతకంటే చాలా పెద్దది.

రాష్ట్రపతి ఏ కార్యక్రమానికి వెళ్లినా అక్కడ ఏం జరగాలి? ఎవరిని కలవాలి? ఎవరి నుంచి ఏ సమాచారం రావాలి? ఏ అధికారితో సమన్వయం చేయాలి? చివరి నిమిషంలో ఏ మార్పు వచ్చినా దాన్ని ఎలా నిర్వహించాలి? ఇవన్నీ ఏడీసీ బాధ్యతల్లో భాగమే.

రిషభ్ చెప్పిన ప్రకారం, రాష్ట్రపతి ప్రధానితో మాట్లాడాలనుకున్నా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ఆ సంభాషణ జరిగేలా చేయడం కూడా ఏడీసీ బాధ్యతల్లో ఒకటి. ఆయన మాటల్లో చెప్పాలంటే.. అందరినీ ఒకే పేజీపైకి తీసుకురావడమే ఈ ఉద్యోగంలో అత్యంత కష్టమైన భాగాల్లో ఒకటి.

అంటే రాష్ట్రపతి దగ్గర కనిపించే అధికారి కేవలం ప్రోటోకాల్ కోసం నిలబడే వ్యక్తి కాదు. ఒక కార్యక్రమం సజావుగా సాగడానికి కనిపించకుండా పనిచేసే మేనేజర్ కూడా.

ఒక హెల్మెట్ కూడా మిస్ కాకూడదు! అయితే ఈ ఉద్యోగంలో అసలైన ట్విస్ట్ భద్రత. రిషభ్ చెప్పిన వివరాల ప్రకారం, రాష్ట్రపతి చుట్టూ కొన్ని సందర్భాల్లో సుమారు ఒక కిలోమీటర్ పరిధిని సెక్యూర్ చేస్తారు. ఆయుధాలు, లోహ వస్తువులు, ప్రమాదకరమైన పదార్థాలు వంటివి ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.



ఇంతటి భద్రత ఎందుకు అవసరమో ఆయన చెప్పిన మరో విషయం అర్థమయ్యేలా చేస్తుంది. రాష్ట్రపతిని కలిసే వ్యక్తి ఆమెకు నమస్కారం చేయడానికి ముందుకు వచ్చినా, చేయి కలపడానికి వచ్చినా.. అతని ఉద్దేశం ఏమిటో ఎవరికి తెలుసు? చివరికి రాష్ట్రపతి తాగే నీటి గ్లాసును కూడా ఎవరు పెట్టారు? అందులో ఏమైనా ఉందా? అనే స్థాయిలో జాగ్రత్త ఉంటుందని రిషభ్ వివరించారు.

అందుకే రాష్ట్రపతి దగ్గర ఎవరైనా కనిపించినప్పుడు.. "ఎందుకు ఇంత దగ్గరకు రానివ్వరు?" అనిపించే దృశ్యాల వెనుక ఒక కారణం ఉంటుంది.

రాష్ట్రపతి భద్రత కోసం ఇలాంటి శిక్షణ! ఇంకా ఆసక్తికరమైన విషయం ఏడీసీ ల శిక్షణ. రిషభ్ చెప్పిన వివరాల ప్రకారం, శిక్షణలో 70- 80 కిలోల బరువుతో ఉండటం, ఆహారం, నీరు, నిద్రకు తీవ్రమైన పరిమితులు విధించడం వంటి కఠిన పరిస్థితులు ఉంటాయి. 30-40 రోజుల పాటు శారీరక, మానసిక సామర్థ్యాలను పరీక్షించే విధంగా శిక్షణ ఉంటుందని ఆయన వివరించాడు.

ఒక కిలోమీటర్ వరకు ఒక రూట్‌లో నడిపిస్తారు. దారిలో ఎక్కడో చెట్టు వెనుక హెల్మెట్ పెడతారు. ఇంకెక్కడో మరో వస్తువు ఉంచుతారు. నడక పూర్తయిన తర్వాత "ఏం చూశావు?" అని అడుగుతారు. అదే ఈ శిక్షణ ఉద్దేశం. శరీరం అలసిపోయినా.. మెదడు మాత్రం అలసిపోకూడదు.

చుట్టూ ఏం జరుగుతుందో గుర్తించే సామర్థ్యం తగ్గకూడదు. రాష్ట్రపతి భద్రతలో ఒక చిన్న వస్తువు కూడా చిన్నదే కాదు కాబట్టి. కానీ ఈ ఉద్యోగం అతని సొంత జీవితాన్ని మాత్రం తీసుకుంది

ఇక్కడే రిషభ్ కథకు అసలు మానవీయ కోణం వస్తుంది... "నేను పెళ్లి చేసుకోలేదు. రాష్ట్రపతి ADC\కు పెళ్లి చేసుకోకూడదనే నిబంధన ఉంది. కుటుంబానికి దూరంగా ఉండాలి. బయట సాధారణ మనిషిలా తిరిగి జీవితాన్ని ఆస్వాదించలేను. అదే నేను చెల్లించిన మూల్యం" అని ఆయన చెప్పాడు.

ఇక్కడ ఒక విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాలి. ఆయన ఆర్మీ వదిలింది పెళ్లి చేసుకోవడం కోసం అని చెప్పడం తప్పు. రిషభ్ స్వయంగా తన రిటైర్మెంట్‌కు కుటుంబ బాధ్యతలే కారణమని చెప్పాడు. సోషల్ మీడియాలో వచ్చిన పెళ్లి, భార్యలు, వ్యక్తిగత సంబంధాలపై పుకార్లను కూడా ఆయన ఖండించాడు.

అంటే ఆయన తీసుకున్న నిర్ణయం ఒక ప్రేమకథకు క్లైమాక్స్ కాదు. తన జీవితంలో ఇంకో అధ్యాయానికి చోటు కల్పించుకోవాలనే నిర్ణయం.

ముర్ములో తల్లిని చూసుకున్నాడు... అన్నింటికంటే భావోద్వేగమైన విషయం మాత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఆయనకు ఏర్పడిన అనుబంధం.

2014 నుంచి తన సొంత తల్లితో కలిసి గడిపిన సమయం చాలా తక్కువగా ఉందని రిషభ్ చెప్పారు. రాష్ట్రపతిని మొదటిసారి చూసినప్పుడు తన తల్లి ఎదురుగా నిలబడి ఉన్నట్లుగా అనిపించిందని గుర్తుచేసుకున్నాడు. ఆమె తనపై చూపిన వాత్సల్యం తన తల్లిని గుర్తు చేసేదని చెప్పారు.

అందుకే ఈ కథలో ఒక విచిత్రమైన వైరుధ్యం కనిపిస్తుంది. దేశ ప్రథమ పౌరురాలిని కాపాడే ఉద్యోగం అతనికి వ్యక్తిగత జీవితాన్ని దూరం చేసింది. కానీ అదే ఉద్యోగం అతనికి ఒక తల్లి లాంటి అనుబంధాన్ని కూడా ఇచ్చింది...!!

**- ముచ్చట డాట్ కం సౌజన్యంతో...**

# వినాయకుడా.. మా మొర విను..!

## మధ్యతరగతి మనిషిగా వేడుకుంటున్న..

**- డాక్టర్ డి. రాజేష్, డీఎస్పీ**



ఈ లోకంలో కాలుష్యం కన్నా ఎక్కువగా పేరుకుపోయిన అనైతిక రాజకీయాలను, నాయకులు వాడే భాషను, అవినీతి అధికారులను, కోర్టు తీర్పులను, న్యాయ మూర్తులను, తెలుగు రాష్ట్రాల సర్వీస్ కమిషన్ల కమిషన్ గా మారిన అక్రమ గ్రూప్ 1 పరీక్షలను, ఇతర ప్రవేశ పరీక్షలను, విద్యా వ్యవస్థను, ఇష్టారాజ్యంగా టెలికాస్ట్ చేసే యూ ట్యూబర్స్‌ను, సోషల్ మీడియాను, మాదక ద్రవ్యాలకు, మత్తు మందులకు అలవాటు పడి

పాన్ పరాగ్, గుట్కాలకు దాసోహమైన యువతను, అక్రమ కల్తీలను, అశ్లీలమైన సైట్‌లను, అడ్డు అదుపులేని ఆప్ లను, అనియంత్రిత రీల్స్ ను అరికట్టుమని... కష్టపడి ఎన్నో త్యాగలకు ఓర్చుకొని చదివి, ఉద్యోగాలు సంపాదించి లెక్కలేనన్ని టాక్స్‌లు కడుతూ ఒక మధ్యతరగతి మనిషిగా వేడుకుంటున్న ఓ వినాయకా!

పూర్తిగా దిగజారిన రాజకీయ పార్టీలకు అండదండలు అందించే స్వార్థపూరిత

సివిల్ సర్వీస్ అధికారులను, అవినీతి ఉద్యోగులను, రాజకీయ పార్టీలను చెంచాలుగా మారి, వంతపాడే వింత జర్నలిస్టులను, కుహనా మేధావులను, TV చానళ్ళను, పార్టీ మ్యాన్ ఫ్యాస్టోలను, ఉచిత పథకాలను, అక్రమ సంపాదన కాంక్షలను, భూఆక్రమణ దారులను అడ్డుకట్ట వేసి మార్చివేయు లేదంటే ప్రకృతి వైపరీత్యాలతో నేపాల్ వరదల మాదిరిగా వీరిని సమూలంగా అడ్రస్ లేకుండా భూస్థాపితం చెయ్యమని ప్రార్థిస్తున్నా

**ఓ వినాయకా !**

నేరాలు ఘోరాలు చేస్తూ లోకంలో దర్జాగా బ్రతుకుతున్న వారి జీవితాలలో మార్పు తీసుకరా, ఇంకా కాదంటే అర్జంటైనా లో సముద్రం ఎలా వెనక్కి వెళ్లి పోయిందో అలా ఆ నీచుల కుటుంబాల స్థితిని వంద సంవత్సరాలు వెనక్కి పంపించు. దేవుడా ఇదే మా అందరి మనఃపూర్వకమైన వినతిని ఆమోదించి



ఆశీస్సులందజేయు ఓ వినాయకా !

"వినాయక చవితి శుభాకాంక్షలు"



# నిశ్శబ్దం బద్దలైంది...

## నవశక్తికి శోభా డే నీరాజనం!

### యువత తిరుగుబాటుపై మౌనం వీడిన రచయిత్రి

### జెన్ జీ పోరాటానికి జేజేలు!




దేశంలో రగులుతున్న విద్యార్థి ఉద్యమాలపై, 'జెన్ జీ' యువత చూపుతున్న అపూర్వ పోరాట పటిమపై ప్రముఖ రచయిత్రి శోభా డే తన నిశ్శబ్ద వైఖరిని వీడారు. సమాజం భయంతో పెదవులు మూసుకున్న వేళ, వ్యవస్థలోని కుళ్ళూ చేతకానితనాన్ని ప్రశ్నిస్తూ రోడ్లపైకి వచ్చిన ఈ తరం ధైర్యాన్ని ఆమె మనస్ఫూర్తిగా ప్రశంసించారు.

'మీరు తప్పుడు తరంతో పెట్టుకున్నారు' అంటూ యువత విసిరిన నిరసన శరాన్ని సమాజపు గుండెల్లోకి దిగిన హెచ్చరికగా అభివర్ణిస్తూ, ఈ నవతరపు చైతన్యానికి శోభా డే అడుగడుగునా జేజేలు పలికారు.

### పెద్దల భయాన్ని చెరిపేసిన తరమిది!

దశాబ్దాలుగా అధికారానికి, బెదిరింపులకు లొంగిపోయి మౌనంగా భరించిన పాత తరాల బానిసత్వాన్ని జెన్ జీ తుత్తునియలు చేసిందని ఆమె స్పష్టంగా చెప్పారు.

దేనికీ అమ్ముడుపోకుండా, పాలకుల పాతకాలపు ఉపదేశాలను తృణప్రాయంగా తిరస్కరిస్తూ, తమ భవిష్యత్తు కోసం నిలదీసే వెన్నుముక ఈ యువతకు ఉందన్నారు. సెలబ్రిటీల నకిలీ సానుభూతిని, ప్రభుత్వాల కాలయాపన వ్యూహాలను నిరసిస్తూ... ప్రజాస్వామ్యపు అసలైన స్వరూపాన్ని, పదునైన ప్రశ్నించే గొంతుకను ఈ నవతరం దేశానికి పునరుజ్జీవింపజేసిందని ఆమె ఉద్ఘాటించారు.

### వ్యవస్థను కదిలించిన నూతన విప్లవం

ఇది కేవలం ఒక నిరసన మాత్రమే కాదని, కునుకుపాటు పట్టిన సమాజపు గుండెల్లో ఆశల దివ్వెలు వెలిగించిన మహా విప్లవమని ఆమె కొనియాడారు. భయంతో మూగబోయిన కోట్లాది గొంతుకలకు ఈ ఉద్యమం నూతన శ్వాసను ఇచ్చిందని, పాలకుల సింహాసనాలను సైతం పటాపంచలు చేసే సత్తా ఈ యువ చైతన్యానికి ఉందని లోకానికి చాటిచెప్పారు.

అధికార మదంతో విర్రవీగే వ్యవస్థలకు జెన్ జీ నేర్పిన ఈ ధైర్యపాఠం దేశ చరిత్రలోనే నిలిచిపోతుందని చెబుతూ, పోరాట పథంలో సాగుతున్న యువతకు శోభా డే తన అకుంఠిత మద్దతును ప్రకటిస్తూ శభాష్ అని మెచ్చుకున్నారు.

**- కృష్ణ కనూరి**





# నాగోల్‌లో తెలంగాణలోనే అతిపెద్ద మట్టి గణపతి..

## ఖైరతాబాద్‌ను మించిన 72 అడుగుల అష్టసిద్ధి మహాగణపతి

**(ఈదుల్ల మల్లయ్య)**

హైదరాబాద్‌లో వినాయక చవితి అంటే సాధారణంగా ఖైరతాబాద్ మహా గణపతే గుర్తుకొస్తాడు. కానీ ఈసారి నాగోల్ ఎక్స్ రోడ్ వద్ద తిరంగా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న 72 అడుగుల మట్టి విగ్రహం నగరవాసుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఏడాది ఖైరతాబాద్ విగ్రహం 69 అడుగుల ఎత్తుతో పంచముఖ సంకటహర మహాగణపతిగా నిలవగా, నాగోల్‌లోని అష్టసిద్ధి మహాగణపతి అంతకంటే ఎత్తుగా నిలిచి తెలంగాణలోనే అతిపెద్ద మట్టి గణపతిగా రికార్డు సృష్టించాడు.

పర్యావరణ హితంగా, పూర్తిగా సహజ పదార్థాలతో ఈ ప్రతిమను తయారు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలు వాడలేదు. కర్రలు, గడ్డి, వరిపొట్టు, జనుము, కలకత్తా బంకమట్టి, సుతిలి, గంగా మట్టితో నిర్మించి, వాటర్ కలర్స్‌తో అద్భుతంగా పెయింట్ చేశారు. మండపం కూడా కర్రలు, సేంద్రియ వస్త్రాలతోనే ఏర్పాటు చేశారు. శిల్పి కొత్తకొండ నగేశ్ ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన 21 మంది కళాకారులు దాదాపు రెండున్నర నుంచి మూడు నెలల పాటు రాత్రింబవళ్లు శ్రమించి ఈ విగ్రహాన్ని పూర్తి చేశారు. అంచనా వ్యయం సుమారు రూ.50 లక్షలు. ప్రధాన విగ్రహంతో పాటు ఏడు చిన్న రూపాలను కూడా ఏర్పాటు చేశారు.

తిరంగా యూత్ అసోసియేషన్ దాదాపు రెండు దశాబ్దాలుగా వినాయకోత్సవాలు నిర్వహిస్తోంది. గత ఎనిమిది-పది ఏళ్లుగా మట్టి విగ్రహాలపై దృష్టి సారించి, ప్రతి సంవత్సరం ఎత్తును పెంచుతూ వస్తోంది. కోవిడ్ తర్వాత 9 అడుగుల నుంచి ప్రారంభమై గతేడాది 63 అడుగులకు చేరిన విగ్రహం ఈసారి 72 అడుగులకు ఎదిగింది. అసోసియేషన్ సభ్యులు సాయి ముదిరాజ్, ప్రణీత్ తదితరులు ఇది కేవలం పండుగ కాదని, పర్యావరణ బాధ్యతతో కూడిన ఉద్యమమని చెబుతున్నారు.

ప్రత్యేకత ఏమిటంటే నిమజ్జనం సరస్సులో కాకుండా మండపం వద్దే చేయనున్నారు. తెలంగాణ ఫైర్ సర్వీసెస్ సహాయంతో నిమజ్జనం తర్వాత మట్టిని మూడు రోజులు అలాగే ఉంచి, భక్తులు తులసి కుండీలు వంటి అవసరాలకు తిరిగి వాడుకునేలా ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల నీటి వనరులు కలుషితం కాకుండా ఉంటాయి. వినాయక చవితి సెప్టెంబర్ 14న ప్రారంభమైంది. ఈ నెల 26న నాగోల్‌లోని ఈ మట్టి మహాగణపతికి నిమజ్జనం జరగనుంది.

నగరంలో భారీ విగ్రహాల పోటీలో ఖైరతాబాద్ సాంప్రదాయానికి పర్యావరణ స్నేహపూర్వక ప్రత్యామ్నాయంగా నాగోల్ మట్టి గణపతి నిలుస్తున్నాడు. భక్తి, కళ, పర్యావరణం మూడింటినీ కలిపిన ఈ ప్రయత్నం యువతకు ఆదర్శంగా మారింది.

PRIENTED AND PUBLISHED BY **DYAVATHI NAGARAJU,** PRINTED **AT RATNA GRAPHICS,** 2-3-703/7, THIRUMALA NAGAR COLONY , OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. **EDITOR: DYAVATHI NAGARAJU, (PRGI NO. TGTEL/25/A1805)** CELL NO: 91541 59200